


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 338 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | బుధవారం 16 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

# తెలంగాణ అభివృద్ధిలో "ఆగా ఖాన్" భాగస్వామ్యం

## - సీఎం రేవంత్ రెడ్డి

- విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో సహకారం అందించాలని సీఎం విజ్ఞప్తి.
- చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి పునరుద్ధరణకు ఫౌండేషన్ చేయూత కోరిన ప్రభుత్వం
- భారత్ ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆహ్వానం.
- డిసెంబర్‌లో జరిగే 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు సీఎం ఆహ్వానం



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్–Vతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమై, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఫౌండేషన్ మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పనిచేయాలని, ముఖ్యంగా శాసనమండలి, కుతుబ్ షాహీ టూంబ్స్ పునరుద్ధరణ తరహాలోనే మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కాలేజ్, పాత ఉస్మానియా ఆసుపత్రి భవనాల పరిరక్షణలో తోడ్పాటునందించాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవనం, నైట్ ఎకానమీ ప్రణాళికలతో పాటు 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నెట్–జీరో నగరంగా రూపుదిద్దుకుంటున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' విశేషాలను సీఎం వివరించగా, ప్రిన్స్ ఆగా ఖాన్ దీనిపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ప్రిన్స్ రహీమ్‌ను సీఎం ఆహ్వానించారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని అధికారులు కోరిన ఈ సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్య సలహాదారు కె. రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు యోగితా రాణా, వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో విషాద ఘటన.. హాస్టల్ భవనంపై నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 23 ఏళ్ల యువకుడు తాను నివసిస్తున్న హాస్టల్ భవనం పైనుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన యశ్వంత్ (23) గచ్చిబౌలిలోని ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తిరీత్యా పది రోజుల క్రితమే అతడు మాదాపూర్‌లోని ఒక కో-లివింగ్ హాస్టల్‌లో చేరాడు. మంగళవారం తనకు ఆరోగ్యం బాగాలేదని యశ్వంత్ హాస్టల్ సిబ్బందికి తెలిపినట్లు సమాచారం. ఆ తర్వాత కొద్దిసేపటికే అతడు భవనం పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకేశాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, యశ్వంత్ ఆత్మహత్యకు దారి



తీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

## పరస్పర సున్నితత్వం పాటించాలి

### - జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ



- బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ
- పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని మోదీ స్పష్టీకరణ
- భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి
- శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి

2

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

### - కేటీఆర్



- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు

2

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక.. అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు



»2

## యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు ఖరారు.. కస్టమర్లపై భారం లేదన్న ఎన్‌పీసీఐ

- రూ. 2,000 దాటిన మర్చంట్ పేమెంట్లపై 0.4 శాతం ఛార్జీ
- వినియోగదారులకు ఎలాంటి అదనపు భారం ఉండదు
- పీ2పీ, రూ. 2000 లోపు వ్యాపార చెల్లింపులు ఎండీఆర్ పరిధిలోకి రావు
- వ్యక్తిగత యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితం
- వ్యక్తిగత యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితం

UPI
UNIFIED PAYMENTS INTERFACE

»2

## కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ,

### - మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య తీసుకుందని వెల్లడి
- పార్టీ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య
- ప్రభుత్వం, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి



»2

## 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది

### - రఘునందన్ రావు



- లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు

**నేటి శుభోదయ, న్యూఢిల్లీ :** తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన ... »2

## ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం..

### నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

- ఎర్రవల్లి కేసులో నిందితుల అరెస్టుపై హైకోర్టు బ్రేక్
- నిందితులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని ఆదేశం
- ఏడేళ్లలోపు శిక్ష వర్తించే కేసులపై పోలీసులను నిలదీసిన కోర్టు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని స్పష్టీకరణ
- అరెస్టులపై పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన .....

2

# అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫోటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది

### - రఘునందన్ రావు

**మొదటిపేజీ తరువాయి..** చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లోసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

## ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం.. నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

**మొదటిపేజీ తరువాయి..** కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

## యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు ఖరారు.. కస్టమర్లపై భారం లేదన్న ఎన్‌పీసీఐ

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగంలో ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ప్రకటన చేసింది. వ్యాపారులకు చేసే చెల్లింపులపై కొన్ని రుసుములను ప్రవేశపెట్టినప్పటికీ, ఆ భారం వినియోగదారులపై పడదని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం కోట్లాది మంది యూపీఐ వినియోగదారులకు పెద్ద ఊరటనిస్తోంది. ఎన్‌పీసీఐ తాజా నిబంధనల ప్రకారం, వ్యాపార చెల్లింపులలో (మర్చంట్ పేమెంట్స్) రూ. 2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం రుసుము వర్తిస్తుంది. అయితే, ఈ ఛార్జీని కస్టమర్ల నుంచి వసూలు చేయకుండా వ్యాపారులే భరించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ఈ రుసుము రూ. 300 మించకుండా పరిమితి విధించారు. దీనివల్ల సాధారణ వినియోగదారులు తమ జేబు నుంచి ఎలాంటి అదనపు మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదు. మొత్తం పీ2ఎం (పర్సన్ టు మర్చంట్) లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ. 2,000 లోపే ఉండటం వల్ల చిన్న వ్యాపారులపై కూడా ఎటువంటి ప్రభావం ఉండదని ఎన్‌పీసీఐ పేర్కొంది. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, వ్యాలెట్లతో పోలిస్తే సవరించిన ఈ యూపీఐ ఎండీఆర్ రుసుములు చాలా తక్కువని వెల్లడించింది. అదే సమయంలో రైల్వే, టెలికాం సేవలు, ఇన్స్యూరెన్స్, ఇంధనం వంటి కొన్ని ప్రత్యేక విభాగాల్లో రూ. 2,000 దాటిన యూపీఐ చెల్లింపులపై ఫ్లాట్‌గా రూ. 5 రుసుము వర్తిస్తుందని ఎన్‌పీసీఐ పేర్కొంది. ఈ ఛార్జీలను సైతం సంబంధిత వ్యాపారులు, సేవా సంస్థలే చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, ఇద్దరు వ్యక్తుల మధ్య (పీ2పీ) లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని, అవి ఎంత మొత్తమైనా యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు కేవలం మర్చంట్ పేమెంట్లకే పరిమితం కావడంతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగదు.

# నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు : కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# పరస్పర సున్నితత్వం పాటించాలి

### - జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి..** న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

# తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక..

### - అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు

**మొదటిపేజీ తరువాయి..** ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ, - మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి..** కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ''పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు'' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లా డి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

# అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు..

### - తీవ్రంగా స్పందించిన చైనా

- అంతరిక్షంలో ఆయుధాలు మోహరించడంపై అమెరికాను తీవ్రంగా విమర్శించిన చైనా
- తమ వద్ద కక్ష్యలో ఆయుధాలు ఉన్నాయని అమెరికా అంగీకరించిన నేపథ్యంలో ఈ పరిణామం
- అంతరిక్షంలో సైనిక కార్యకలాపాలు ఆపాలని వాషింగ్టన్‌కు బీజింగ్ డిమాండ్
- స్పేస్‌లో ఆయుధ పోటీని తాము వ్యతిరేకిస్తున్నామని చైనా విదేశాంగ శాఖ స్పష్టం
- చైనా, రష్యాలు కూడా అంతరిక్ష ఆయుధాలను అభివృద్ధి చేస్తున్నాయని ఆందోళన

**నేటి శుభోదయ, అంతర్జాతీయం :** అంతరిక్షంలో అమెరికా ఆయుధాలను మోహరించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. అంతరిక్షంలో సైనిక కార్యకలాపాలను, ఆయుధ సమీకరణను తక్షణమే నిలిపివేయాలని వాషింగ్టన్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంతరిక్షంలో తమ వద్ద "కక్ష్య నియంత్రణ ఆయుధాలు" ఉన్నాయని యూఎస్ ఎయిర్ ఫోర్స్ సెక్రటరీ ట్రాయ్ మీంక్ బహిరంగంగా అంగీకరించిన మరుసటి రోజే చైనా ఈ విధంగా స్పందించింది. తమ బలగాలపై జరిగే శత్రు దాడులను తిప్పికొట్టేందుకే ఈ ఆయుధాలను మోహరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే, ఇవి ఎలాంటి ఆయుధాలు, వాటి సామర్థ్యాలేమిటనే వివరాలను మాత్రం ఆయన బహిర్గతం చేయలేదు. ఆ వివరాలు వెల్లడిస్తే వాటి వ్యూహాత్మక ప్రాధాన్యత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. "అంతరిక్షాన్ని కేవలం శాంతియుత ప్రయోజనాలకే వినియోగించాలి. దానిని యుద్ధ క్షేత్రంగా మార్చే ఏ ప్రయత్నాన్నైనా చైనా వ్యతిరేకిస్తుంది. స్పేస్‌లో ఆయుధ పోటీని మేం నిరోధిస్తాం. అమెరికా తన సైనిక కార్యకలాపాలను నిలిపివేసి, ప్రపంచ వ్యూహాత్మక స్థిరత్వాన్ని కాపాడాలి" అని చైనా తన ప్రకటనలో స్పష్టం చేసింది. 1967 నాటి అంతరిక్ష ఒప్పందం ప్రకారం రోదసిలో అణుబాంబులు వంటి సామూహిక విధ్వంసక ఆయుధాల వినియోగాన్ని నిషేధించారు. అయితే, ఉపగ్రహాలను అడ్డుకునే సంప్రదాయ ఆయుధాలపై ఎటువంటి నిషేధం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్' మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో భాగంగానే ఈ సైనిక విస్తరణ జరుగుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, చైనా, రష్యాలు కూడా ఇటువంటి కౌంటర్-స్పేస్ సామర్థ్యాలను అభివృద్ధి చేస్తుండటంతో, రోదసిలో కొత్త ఆయుధ పోటీ ప్రారంభమైందన్న ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి.



# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో సాగర్ జలాల విడుదల

- పంటలకు ప్రాణం పోసిన సాగునీరు.. హర్షం వ్యక్తం చేసిన బోనకల్ రైతాంగం



**బోనకల్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో నాగార్జునసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేయడంతో బోనకల్ మండల రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది. బీబీసీ కాలువ ద్వారా సాగర్ జలాలు బోనకల్ మండలానికి చేరుకోవడంతో వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్న పంటలకు ఊరట లభించింది.సాగర్ జలాలు రావడంతో సాగునీటితో పాటు చెరువులు, కుంటల్లోకి నీరు చేరే అవకాశం ఏర్పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సాగునీరు అందడంతో వాటిని కాపాడుకునే అవకాశం ఏర్పడిందని రైతులు తెలిపారు. పంటలు ఎండిపోతున్న సమయంలో సాగర్ నీరు విడుదల చేయడం పంటలకు ప్రాణం పోసినట్టుగా ఉందని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే గుర్తించి ప్రజా ప్రభుత్వం సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగర్ జలాలను విడుదల చేయడం అభినందనీయమని రైతులు అన్నారు. అందుబాటులోకి వచ్చిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుకోవాలని వారు కోరారు.సాగర్ జలాలను విడుదల చేయించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు



బోనకల్ మండల రైతాంగం ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపింది.ఈ కార్యక్రమంలో బోనకల్ మండల అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, పైడిపల్లి కిషోర్, పిల్లలమరి నాగేశ్వరరావు, బద్రు నాయక్, యార్రంశెట్టి సుబ్బారావు, కందుల పాపారావు, గూడా నరసయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌లోనే దాడి యత్నం దురదృష్టకరం: డా. మెతుకు ఆనంద్

**వికారాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వికారాబాద్: హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ వ్యక్తిగత సహాయకుడు, ప్రజా సంబంధాల అధికారి పై దాడికి యత్నించిన ఘటనపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ స్పందించారు. పోలీస్ స్టేషన్‌లోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, వాటిని వ్యక్తులపై దాడులకు దారితీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాజకీయ విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డా. మెతుకు ఆనంద్ సూచించారు.




# ఎంఆర్‌పిఎస్ రూరల్ నియోజకవర్గం ఆధ్వర్యంలో 'ఎమ్ఇఎఫ్' జాతీయ కోర్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

**నిజామాబాద్ రూరల్ డిచ్ పల్లి, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా కేంద్రం లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ మరియు మండల ఇంచార్జ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం నాడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో పనిచేస్తున్న ఎమ్ఆర్‌పిఎస్ అనుబంధ సంఘం "మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్" (MEF) జాతీయ కార్యవర్గ కోర్ కమిటీ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన నాయకులను ఘనంగా సన్మానించారు. జాతీయ కోర్ కమిటీ సభ్యులుగా నూతనంగా నియామకమైన తెడ్డు గంగారాం, ఆర్. నాంపల్లి,మరియు జాతీయ ఉపాధ్యక్షులు సురేష్ (GHM) గార్లకు సంఘం ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రూరల్ ఇంచార్జ్ గందమాల నాగభూషణం మాట్లాడుతూ... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆశయ సాధనకు, ఉద్యోగ సమాజ సంక్షేమానికీ మరియు ఎమ్ ఆర్ పి ఎస్ తీసుకునే అన్ని కార్యాచరణ లో నూతనంగా ఎన్నికైన జాతీయ నాయకులు నిరంతరం కృషి చేయాలని తెలిపారు . బాధ్యతలు స్వీకరించిన నాయకులు సంఘ బలోపేతానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముందుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్,జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి, జిల్లా సీనియర్ నాయకులు సరికెళ్ల పోశెట్టి,ధర్పల్లి మండలం ఇన్చార్జి





నక్క రాజేందర్, డిచ్పల్లి మండలం ఇన్చార్జి డప్పు నరసయ్య, ఇందల్వాయి మండలం ఇన్చార్జి సంగేమ్ కిష్టయ్య, రూరల్ మండలం ఇంచార్జ్ శ్రీ రాములు, సిరికొండ మండలం ఇన్చార్జి మొట్టల దీపక్, వివిధ మండలాల ఇంచార్జ్‌లు, నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్ శివాలయంలో కొలువుదీరిన గణనాథుడు



**షాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వినాయక చవితి సందర్భంగా షాబాద్ గ్రామంలోని శివాలయంలో శివాలయం సేవా సమితి ఆధ్వర్యంలో గణనాథుడిని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో విఘ్నేశ్వరుడికి మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు, అర్చనలు నిర్వహించారు. పూలు, పత్రి, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జై గణేశ్ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వినాయక చవితి వేడుకల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# రైతులు, వ్యవసాయ కూలీలను విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ఇల్లందు మాజీ ఎంఎల్ ఏ గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ల విమర్శ
- ఇల్లందు మాజీ ఎంఎల్ ఏ గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్)





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** సిరికొండ మండలం లోని గడ్కోల్ గ్రామం లో జరుగుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులనుజెండాను ఎగరావేసి సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ: కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా వ్యతిరేకత ఉన్నది అన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి రైతుల గొంతు కోస్తున్నారని అన్నారు. అనేక రోజులుగా రైతంగం ఢిల్లీ వేదికగా పోరాడుతుంటే వారిపై పోలీసు యంత్రం గాని ఉదయించి ఉక్కు పాదంతో అలసివేశారన్నారు,. ఎమ్మెస్ చట్టం లాంటివి అమలు చేస్తామని హామీ ఇచ్చి ఎం.ఎస్.పి చట్టం, రైతంగా సమస్యలు పరిష్కారం కు రాతపూర్వకంగా హామీ ఇచ్చి విస్మరించిన ప్రధాని మోడీ అన్నారు. ఆదానికి వేశారంగాన్ని కప్పు కట్టబెట్టడానికి ఉషారాంగాన్ని దివానా చేయడానికి అనేక రకాల వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నారని వారు విమర్శించారు రాష్ట్రంలో అధికారంలో ఉన్నటువంటి రేవంత్ రెడ్డి సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మొండి చేయి చూపారు అన్నారు. కేసీఆర్ చేసినట్టుగా కాంగ్రెస్ రైతులకు ఏమాత్రం చేయడం లేదు అన్నారు. భరోసా ను రైతులకు ఇవ్వడంలో మీనా వేశాలు లెక్కిస్తున్నారు. పోడు భూముల విషయం లో హక్కులు కల్పిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు అని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు సంగటితం అయి పాలక వర్గాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఉన్నదని వారన్నారు. బలమైన పోరాటాలు వస్తేనే ప్రజల మౌలికమైన సమస్యలు పరిష్కారం అవుతాయని వారు అన్నారు. కార్యక్రమంలో మొదటిరోజు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం సందర్భంగా అమరవీరులకు నివాళులు అర్పించారు. మొదటిరోజు ఫస్ట్ క్లాస్ వీఐ రమణ గారు "తత్వశాస్త్రం " ను బోధించారు. కార్యక్రమం లో సెక్రటేరియట్ సభ్యులు కెచ్చల రంగయ్య,కట్ట రమా ,వి ప్రభాకర్ ,వి కృష్ణ,చిన్న చంద్రన్న ఎం కృష్ణ,సూర్యం,హన్మేశ్,SL పద్మ,రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ ,బి రాము,జి రామయ్య,cy పుల్లయ్య, నందిరామయ్య, జిల్లా నాయకులు,ఆర్ రమేష్ బి దేవరం,నాయకులు ఆర్ దామోదర్,బి బాబన్న కిషోర్ రమేష్, రమ ,సత్తెమ్మ,పుష్ప,జమున,లావణ్య తదితరులు పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో వినాయక పూజ



**వికారాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** పరిగి రూప్‌ఖాన్‌పేట్: గ్రామంలోని 5వ వార్డులో శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో వినాయక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 5వ వార్డు సభ్యుడు సాయి గణేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సాయి గణేష్ మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. గ్రామంలో ప్రజలంతా ఐకమత్యంతో, ప్రశాంత వాతావరణంలో పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని తెలిపారు.

# రాష్ట్రస్థాయి 'జిజ్ఞాస' పోటీల్లో మల్కాజిగిరి డిగ్రీ కళాశాల సత్తా

- **హిందీ, భౌతికశాస్త్రంలో ప్రథమ బహుమతులు.. వృక్షశాస్త్రంలో తృతీయ స్థానం**



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి నిర్వహించిన రాష్ట్రస్థాయి 'జిజ్ఞాస' పోటీల్లో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. హిందీ, భౌతికశాస్త్ర విభాగాల్లో ప్రథమ బహుమతులు, వృక్షశాస్త్ర విభాగంలో తృతీయ బహుమతి సాధించి కళాశాల ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో నిలబెట్టారు.విద్యార్థుల అంకితభావం, పట్టుదలతో పాటు వారికి మార్గదర్శకత్వం వహించిన అధ్యాపకుల నిరంతర కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బండి రాజు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి దిశానిర్దేశం చేసిన హిందీ అధ్యాపకులు డాక్టర్ జి.ఎన్. జగన్, భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కదిరి హరిత, వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ లలితలను కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సత్కరించి అభినందించింది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అడవి రాజు, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్, డాక్టర్ మల్లిక, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్‌తో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రిని కలిసిన సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా నాయకులు



**ఏన్కూర్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావును సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షులు భుక్యా నరసింహ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్యా వినోద్ కుమార్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ దేవేందర్ నాయక్ కలిసి హరీష్ రావును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలు, బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, గిరిజనుల హక్కులు, యువత మరియు విద్యార్థుల సమస్యలపై నాయకులు హరీష్ రావుతో చర్చించినట్లు తెలిపారు. జిల్లాలో సేవాలాల్ సేనను మరింత బలోపేతం చేస్తూ, బంజారా సమాజ ఐక్యత కోసం చేపట్టనున్న భవిష్యత్ కార్యక్రమాల గురించి కూడా వివరించారు. సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసుకుని ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయాలని నాయకులు వివరించగా, తన్నీరు హరీష్ రావు నూతన కమిటీకి అభినందనలు తెలియజేసి, వారి కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని తెలిపారు. బంజారా సమాజ అభివృద్ధి, గిరిజనుల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా నాయకులు మాట్లాడుతూ.... హరీష్ రావు తమ నూతన కమిటీని అభినందించి మద్దతు తెలియజేయడం తమకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు. భవిష్యత్‌లో ఖమ్మం జిల్లాలో బంజారా జాతి ఐక్యత, హక్కులు, అభివృద్ధి కోసం మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేనకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల మనిషిగా 'వకీల్ సాబ్' సేవలు చిరస్మరణీయం



**కేశంపేట, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు, సామాజిక సేవకుడిగా ప్రజలకు విశేష సేవలందించిన స్వర్గీయ తాండ్ర వీరేందర్ రెడ్డి 'వకీల్ సాబ్' 81వ జయంతి సందర్భంగా ఆయన సేవలను కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు స్మరించుకున్నారు.న్యాయవాదిగా పనిచేసిన కాలంలో సామాన్యులు, పేదలు, బలహీన వర్గాల సమస్యలను అర్థం చేసుకుని వారికి అండగా నిలిచారు. న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా తనవంతు కృషి చేశారు. రాజకీయ రంగంలోనూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలతో మమేకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు.లయన్స్ క్లబ్ చైర్మన్‌గా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి సమాజ సేవలోనూ తనదైన ముద్ర వేశారు. పేదలు, అవసరమైన వారికి సహాయం చేయడంలో ముందుండేవారు. ముక్కుసూటితనం, నిజాయితీ, నిక్కచ్చితనం ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. నిజాన్ని నిర్భయంగా చెప్పడం, తప్పును ప్రశ్నించడం ఆయన సహజ స్వభావం.ప్రజలతో ఆప్యాయంగా మెలిగిన ఆయనను అందరూ ప్రేమగా 'వకీల్ సాబ్' అని పిలుచుకునేవారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ ప్రజల కోసం చేసిన సేవలు, మానవత్వం, ఆప్యాయత నేటికీ అందరి జ్ఞాపకాల్లో సజీవంగా ఉన్నాయి. 81వ జయంతి సందర్భంగా ఆయన పవిత్ర స్మృతులను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి



**కేశంపేట, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలోని సర్వే నంబర్ 216లో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని గ్రామ పాలక వర్గం, గ్రామ ప్రజలు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 216లో 5.15 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. నిర్మించిన దుకాణాలను అద్దెకు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారని, మరికొందరు మాంసం దుకాణాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ భూమికి సమీపంలో ప్రభుత్వ పాఠశాలలు ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందన్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు గుర్తించాలని కోరారు. అక్రమ కట్టడాలను తొలగించి భూమికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడేలా సర్వే నంబర్ 216లోని ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీకి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రవి నాయక్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆందోళన

- **రక్త నిల్వ కేంద్రం, అత్యవసర విభాగం లోపాలపై సమగ్ర విచారణ జరపాలి: డా. కొప్పుల రాజశేఖర్ రెడ్డి**




**వికారాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ ఆసుపత్రిలో వైద్య సేవల నిర్వహణపై బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ డా. కొప్పుల రాజశేఖర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి పరిశీలన సందర్భంగా రక్త నిల్వ కేంద్రం, అత్యవసర విభాగం, వైద్య ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలో పలు లోపాలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు.రక్త నిల్వ కేంద్రాన్ని ప్రమాణాలకు అనుగుణమైన ప్రత్యేక గదిలో కాకుండా సాధారణ వార్డుకు సంబంధించిన ప్రదేశంలో ఏర్పాటు చేయడం, సరైన ఉష్ణోగ్రత నియంత్రణ సౌకర్యాలు లేకపోవడం వంటి అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా రక్త నిల్వ కేంద్రం నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.రక్త సేకరణ, రక్త నిల్వ సేవలకు అవసరమైన వైద్యాధికారి పోస్టు చాలాకాలంగా ఖాళీగా ఉందన్న సమాచారంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. అలాగే అత్యవసర విభాగంలో అవసరమైన వైద్యాధికారుల నియామకం, ఆసుపత్రి నిర్వహణకు కీలకమైన నివాస వైద్యాధికారి వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వైద్య ఆక్సిజన్ పైప్‌లైన్లలో లీకేజీలు ఉన్నట్లు గుర్తించడం తీవ్ర ఆందోళనకరమని, వాటిపై సాంకేతిక పరిశీలన నిర్వహించి పనుల నాణ్యతను నిర్ధారించాలని అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణం, అధికారిక అప్పగింత, నిర్మాణ పనుల నాణ్యతపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు.ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో అత్యవసర వైద్యం, రక్త నిల్వ, ఆక్సిజన్ వంటి కీలక సేవలు సమర్థంగా అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ అంశాలను జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు కోరనున్నట్లు తెలిపారు

# నాగోల్‌లో అర్బన్ మాంక్ కేఫ్ ఘనంగా ప్రారంభోత్సవం



**నాగోల్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** నాగోల్ లోని కేఎఫ్‌సీ పక్కన, పిల్లర్ నంబర్ 12 వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ మాంక్ కేఫ్ (ఫైన్ డైన్ అండ్ బేకింగ్ )కి ముఖ్య అతిధిగా ఈ గురుకులం ఫౌండర్ ఆకెళ్ళ రాఘవేంద్ర (ఐఎఎస్ ) హాజరై అర్బన్ మాంక్ కేఫ్ సీఈవో దుండిగళ్ళ రాఘవేంద్ర తో కలిసి రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆకెళ్ళ రాఘవేంద్ర మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను సరసమైన ధరలకు అందించాలని వారు సూచించారు.నిర్వాహకులు వ్యాపార రంగంలో ఆర్థికంగా ఎదుగుతూ నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం అర్బన్ మాంక్ కేఫ్ సీఈఓ రాఘవేంద్ర మాట్లాడుతూ..తమ కేఫ్‌లో కాఫీ, కేక్స్, డెజర్ట్స్, బిర్యానీ, తందూరీ, చైనీస్, కాంటినెంటల్ తదితర ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.నాగోల్ పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఫుడ్‌తో పాటు ఆహ్లాదకరమైన డైనింగ్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తమ కేఫ్ ను సందర్శించి వంటకాలను ఆస్వాదించగలరని కోరారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బంధు మిత్రులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా స్కూటీ ర్యాలీ

**నేరేడ్ మెట్ , సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావుతో కలిసి వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.తెలంగాణ విమోచన దినోత్సవం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు తెలంగాణ కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవాలనే ఉద్దేశంతో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు స్కూటీలపై ర్యాలీలో పాల్గొని నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు.ఈ సందర్భంగా క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా





మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూటీ ర్యాలీకి విశేష స్పందన లభించిందని తెలిపారు.కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి ర్యాలీలో పాల్గొనడం సంతోషంగా ఉందని రాజ్యలక్ష్మి తెలిపారు. తెలంగాణ చరిత్ర, పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భవిష్యత్తులోనూ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంషాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించిన సిద్దు రెడ్డి

- పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని హామీ



**శంషాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**

శంషాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాలను సామాజిక సేవకుడు, ప్రముఖ వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి సందర్శించి పాఠశాలలోని సమస్యలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ అవసరమైన పనులను చేపడతానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రాంగణంలో బండలు వేయించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో మరమ్మత్తులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు వేయిస్తానని చెప్పారు. అలాగే పాఠశాల భవనానికి రంగులు వేయించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తానని పేర్కొన్నారు. విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్యూరిఫైడ్ వాటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తానని కందకట్ల సిద్దురెడ్డి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాల మౌలిక వసతులు ఎంతో కీలకమని, వాటి అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానన్నారు. కాగా కందకట్ల సిద్దురెడ్డి కూడా ఇదే ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యాభ్యాసం చేయడం విశేషం. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడే అవకాశం రావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

# కౌకూర్‌ను వరద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంరూ.9.18 కోట్లతో డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభం : తుడిమెళ్ల మల్లికార్జున్

**నేరేడ్ మెట్ , సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**

కౌకూర్ ప్రాంతాన్ని వరద రహితంగా తీర్చిదిద్దడంతో పాటు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు. ఇందులో భాగంగా రూ.9.18 కోట్లతో చేపట్టనున్న పలు డ్రైనేజీ పనులకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.కౌకూర్‌లోని కింది బస్తీ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు సందర్శించి త్వరలో ప్రారంభం కానున్న బాక్స్ డ్రైన్ పనుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ కౌకూర్ పరిధిలో ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న వరద, డ్రైనేజీ సమస్యలను గత ఏడాది స్థానిక ప్రజలతో కలిసి మైనంపల్లి హనుమంత్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పనులకు అవసరమైన సహకారం అందించారని చెప్పారు.ప్రస్తుతం ప్రారంభం కానున్న పనుల్లో కింది బస్తీలో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు, ప్రియదర్శిని ఎన్‌క్లేవ్‌లోని ఉన్న నాలా నుంచి వెన్‌రాగ్ వరకు డ్రైనేజీ పనులకు రూ.4.30 కోట్లు, వెన్‌రాగ్



ఎన్‌క్లేవ్ నుంచి ఓం శ్రీ గ్రాండ్ వరకు పనులకు రూ.2.38 కోట్లు కేటాయించినట్లు మల్లికార్జున్ వివరించారు. మొత్తంగా రూ.9.18 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే కౌకూర్‌లో వరద సమస్యకు గణనీయమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు.అదేవిధంగా విల్లా ఆర్కిడ్స్, జనప్రియ, ప్రశాంత్ విహార్ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ.20 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టాల్సిన డ్రైనేజీ పనులు ప్రస్తుతం బడ్జెట్ ప్రక్రియలో ఉన్నాయని చెప్పారు. ఈ పనులు కూడా పూర్తయితే ఆయా ప్రాంతాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న డ్రైనేజీ, వర్షపు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారానికి మైనంపల్లి హనుమంత్‌రావు ప్రత్యేక చొరవ చూపుతున్నారని మల్లికార్జున్ అన్నారు. భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.అనంతరం కౌకూర్ మోడల్ మార్కెట్ భవనాన్ని మైనంపల్లి



హనుమంత్‌రావు సందర్శించారు. మోడల్ మార్కెట్‌ను ప్రజా ప్రయోజనాల కోసం కాపాడేందుకు సహకరిస్తున్నందుకు కౌకూర్ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జితేంద్రనాథ్, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోట లక్ష్మీకాంత్‌రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మహిపాల్‌రెడ్డి, చిత్ర గోకుల్, బొడ్డి శ్రీనివాస్ యాదవ్, గోకుల్, అల్లి మల్లేష్, పండు, వేణుగౌడ్, సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి, శివరాజ్, శ్రవణ్, ఆసిఫుల్లా ఖాన్, సయ్యద్ అస్లాం, మహేష్ యాదవ్, కిరణ్, అనురాధ, పుష్ప, వాణితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌకూర్ మోడల్ మార్కెట్ కోసం పోరాటానికి ప్రజల నీరాజనం

## - మైనంపల్లి హనుమంత్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం..

- మోడల్ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవడంపై హర్షం



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**

ప్రజా ప్రయోజనాల కోసం కౌకూర్ మోడల్ మార్కెట్‌ను పరిరక్షించేందుకు చేసిన పోరాటం ఫలించడంతో స్థానిక ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మోడల్ మార్కెట్ భవనాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు కేటాయించాలనే నిర్ణయాన్ని పునః పరిశీలించి, మార్కెట్‌ను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై కౌకూర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు చిత్రపటానికి ప్రజలు పాలాభిషేకం చేసి విజయోత్సవాలు నిర్వహించారు.కౌకూర్ ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగపడుతున్న మోడల్ మార్కెట్ భవనాన్ని ఇతర అవసరాలకు కేటాయించాలనే నిర్ణయం వెలువడటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ప్రజా అవసరాల కోసం నిర్మించిన మార్కెట్‌ను ప్రజలకే అందుబాటులో ఉంచాలనే డిమాండ్‌తో తుడిమెళ్ల మల్లికార్జున్ స్థానిక ప్రజలతో కలిసి సమస్యను ముందుకు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు దృష్టికి తీసుకెళ్లి, ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన సహకారం అందించారని తెలిపారు.ప్రజల సమస్యను తన సమస్యగా భావించిన మైనంపల్లి హనుమంత్‌రావు సంబంధిత అధికారులతో మాట్లాడి మోడల్ మార్కెట్‌ను కాపాడేందుకు తన వంతు సహకారం అందించారని మల్లికార్జున్ పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు భంగం కలగకుండా మార్కెట్‌ను కౌకూర్ ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఆయన చూపిన చొరవకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కౌకూర్‌లో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. మైనంపల్లి హనుమంత్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజా సమస్య పరిష్కారానికి సహకరించిన నాయకుడికి కృతజ్ఞతగా పాలాభిషేకం చేయడం ద్వారా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు.మోడల్ మార్కెట్‌ను పరిరక్షించేందుకు తుడిమెళ్ల మల్లికార్జున్ ప్రజలతో కలిసి ముందుండి చేసిన కృషిని స్థానికులు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాయకత్వం వహిస్తూ, సంబంధిత వర్గాల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు."మోడల్ మార్కెట్‌ను కాపాడుకోవడం ఒక్కరి విజయం కాదు.. కౌకూర్ ప్రజలందరి విజయం. ప్రజా ప్రయోజనం కోసం ఐక్యంగా నిలబడి పోరాడితే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఈ విజయం నిరూపించింది" అని తుడిమెళ్ల మల్లికార్జున్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మైనంపల్లి హనుమంత్‌రావు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజల కోసం మైనంపల్లి హనుమంత్‌రావు చేస్తున్న సేవా కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి పనులకు అందిస్తున్న సహకారం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని స్థానికులు తెలిపారు. కౌకూర్ ప్రాంత అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారంలో ఆయన చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలిచి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతగా పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.కౌకూర్ మోడల్ మార్కెట్ విషయంలో సాధించిన ఈ విజయం భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత ఐక్యంగా ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుందని మల్లికార్జున్ అన్నారు. కౌకూర్ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మైనంపల్లి హనుమంత్‌రావు నాయకత్వంలో ప్రజలతో కలిసి నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

# ఘనంగా తూళ్ల వీరేందర్ గౌడ్ ఆత్మీయుల సమ్మేళనం

**ఉప్పల్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**

ఉప్పల్‌లోని శిల్పారామంలో ఆదివారం టీవీజీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన "తూళ్ల వీరేందర్ గౌడ్ ఆత్మీయుల సమ్మేళనం" ఘనంగా జరిగింది. బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ అభిమానులు, ఆత్మీయులు, ఆయన తండ్రి, మాజీ హోంమంత్రి దేవేందర్ గౌడ్ అనుచరులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.దేవేందర్ గౌడ్, తూళ్ల వీరేందర్ గౌడ్‌లతో అనుబంధం కలిగిన అభిమానులు, ఆత్మీయులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇన్నాళ్లుగా కొనసాగుతున్న ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంతోపాటు, పరస్పరం కలుసుకుని తమ అనుభవాలను పంచుకునే అవకాశం లభించింది. దేవేందర్ గౌడ్‌తో



తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు అభిమానులు ఆయన సేవలను స్మరించుకున్నారు.టీవీజీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనం అభిమానులు, ఆత్మీయుల మధ్య ఐక్యతను మరింత పెంపొందించేలా సాగింది.

# పినపాక మండలంలో భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలు..



**పినపాక, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించుకోవడం జరిగింది. గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.వినాయక మండపాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలు, పుష్పాలతో అందంగా అలంకరించారు. గణపతి నామస్మరణతో మండపాల పరిసరాలు భక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి. పలుచోట్ల భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు.యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి విఘ్నేశ్వరుడి ఆశీస్సులు పొందారు.ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ప్రసాదం తదితర సౌకర్యాలను కల్పించారు. వినాయక చవితి వేడుకలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొంది.

# ఆధార్ సంస్థ, పొట్లపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోలార్ లైట్లు ఏర్పాటు

- **విద్యుత్ లేని గ్రామానికి సోలార్ కాంతులు**





**పినపాక, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** పినపాక మండలం, అమరావరం గ్రామపంచాయతీ పరిధిలోని తీర్లాపురం ఆదివాసీ గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేక గ్రామ ప్రజలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో చీకటిలోనే పిల్లలు చదువుకోవాల్సిన పరిస్థితిని గుర్తించిన ఆధార్ స్వచ్ఛంద సంస్థ పొట్లపల్లి కమల మనోహర రావు ఫౌండేషన్ సహకారంతో గ్రామంలో నాలుగు సోలార్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా చిన్నారులు రాత్రివేళ చదువుకోవడానికి, గ్రామస్తులు సంప్రదాయ, సామూహిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఉపయోగపడేలా నాలుగు సోలార్ ల్యాంపులను గ్రామస్తులకు అందజేశారు.విద్యుత్ సౌకర్యం లేని తమ గ్రామంలో వెలుగులు ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పిల్లల చదువుకు, రాత్రివేళల్లో మహిళలు, వృద్ధులు, గ్రామ ప్రజల రాకపోకలకు ఈ లైట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. తమ గ్రామ సమస్యను గుర్తించి సహాయం అందించిన ఆధార్ స్వచ్ఛంద సంస్థ, పొట్లపల్లి కమల మనోహర రావు ఫౌండేషన్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆధార్ సంస్థ నిర్వాహకుడు తోలెం రమేష్ మాట్లాడుతూ ప్రాథమిక సౌకర్యాలు ప్రతి ఆదివాసీ గ్రామానికి అందుబాటులో ఉండాలని, పిల్లల విద్యకు చీకటి అడ్డంకిగా మారకూడదని అన్నారు. ప్రజల అవసరాలను సహాయ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పొట్లపల్లి కమల మనోహర రావు ఫౌండేషన్ ప్రతినిధి అనిరుధ్, సీనియర్ జర్నలిస్ట్ శ్యామ్ మోహన్ రావు, ఆధార్ సంస్థ సభ్యులు,నవీన్, రమేష్ గ్రామ పెద్దలు నూప రామయ్య, నూప వాసు, బడిశ రమేష్ తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వెనుక నుంచి బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. మహిళ మృతి

**శంషాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** శంషాబాద్ సమీపంలోని సిద్దంతి రైల్వే గేట్ ఎదురుగా జాతీయ రహదారి-44పై సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీకొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త, 11 ఏళ్ల కుమార్తె గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరాంఘర్ నుంచి షాద్‌నగర్ వైపు యూనికార్న్ బైక్ (TG31A4095)పై శ్యామ్ సుందర్, ఆయన భార్య బి. సోనీ, 11 ఏళ్ల కుమార్తె కటం శాన్వి ప్రయాణిస్తున్నారు. సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో సిద్దంతి రైల్వే గేట్ ఎదురుగా వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఐచర్ డీసీఎం (KA36C1249) బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న సోనీ రోడ్డుపై పడిపోగా, డీసీఎం ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. శ్యామ్ సుందర్, ఆయన కుమార్తె శాన్వి కూడా బైక్‌పై నుంచి కిందపడటంతో గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి డీసీఎంను నిలిపివేశారు. మృతురాలు బి. సోనీ (36) స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సింధనూర్ తాలూకాకు చెందిన బసవరాజ్‌గా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# పిడుగుపాటుకు మూగజీవాలు మృతి

- **ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు**

**పినపాక, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** పినపాక మండలంలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఉరుములు, మెరుపులు తోడవడంతో మండలంలోని వెంకట్రావుపేట, సీతారాంపురం గ్రామాల్లో అకస్మాత్తుగా పిడుగులు పడడంతో మూగజీవాలు మృత్యువాత పడ్డ సంఘటనలు చోటుచేసుకున్నాయి. వెంకటరావుపేట గ్రామానికి చెందిన పొనగంటి రమేష్‌కు చెందిన ఎద్దులు మేతకు వెళ్లగా, వ్యవసాయ పొలంలో పిడుగు పడటంతో ఒక దుక్కిటెద్దు , సీతారాంపురం గ్రామానికి చెందిన పశుపోషకుడు బొగ్గం రాజుకు చెందిన గేదె మేత మేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినాయి. మూగజీవాల విలువ సుమారు లక్ష రూపాయలకు పైగా ఉంటుందని ,జీవనాధారమైన పాడి గేద,ఎద్దు మృతి చెందడంతో బాధిత రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పశువైద్యాధికారికి సమాచారం అందించారు.పిడుగుపాటుకు పశువులను కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.





# భగవాన్‌దాస్ కాలనీలో ఘనంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు.

- **ఉత్సవ కమిటీ నిర్వాహకులకు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభినందనలు.**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో శ్రీ విఘ్నేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.ఉత్సవ కమిటీకి అభినందనలుఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, భగవాన్‌దాస్ కాలనీలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న శ్రీ విఘ్నేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులను అభినందించారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ ఐక్యతతో, భక్తి భావంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు.గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆయన కోరుకున్నారు. ఉత్సవాల నిర్వహణలో కమిటీ సభ్యులు చూపుతున్న శ్రద్ధ, సమన్వయం అభినందనీయమని పేర్కొన్నారు.పలువురు బీజేపీ నాయకుల పాల్గొనడంఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, కందుల రాంకిషోర్, పసుమర్తి సతీష్, అట్లూరి రఘురామ్, ములిశెట్టి రాంమోహన్ రావు, ముత్యాల శ్రీనివాస్, కంద్రపు త్రినాథ్ రెడ్డి, నూప రమేష్, రామెళ్ళ రాజశేఖర్, పెద్ది జగపతి బాబు, నిడదవోలు నాగబాబు, తాటిపాముల ఐలయ్య, ముత్యాల చంద్రశేఖర్, దేవరపల్లి వెంకటేశ్వర్లు, ములిశెట్టి నిఖిల్, షేర్ శ్రీను, జీవా, మాలోత్ సాయి, కారం చిన్నయ్య, కోర్స గంగరాజు, సోలం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.





# రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్యశోధక్ విద్యార్థుల ప్రతిభ

**నిజామాబాద్ రూరల్ సిరికొండ , సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర సబ్-జూనియర్ అంతర జిల్లా సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (అండర్-15) బాలుర విభాగం పోటీలలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.ఈ పోటీలలో నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు అజయ్, హర్షిత్, శ్రీకాంత్, సాయితేజ లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జట్టు ద్వితీయ స్థానం (రన్నర్స్-అప్) సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మెడల్స్ అందించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి తోడ్పడతాయని, ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థుల కృషి, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఈ ప్రాంతానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



# వెంకటాపూర్ ల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- **నోటీసులు అందుకున్న వారు ఐడీ ప్రూఫ్స్ అందజేయాలి**
- **తహసిల్దార్ రమేష్,సర్పంచ్ బూజూరు పుష్పమ్మ అంజన్‌రెడ్డి,**




**తలకొండపల్లి, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** తలకొండపల్లి: మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బూజూరు పుష్పమ్మ అంజన్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు.మండల తహసీల్దార్ (ఎమ్మార్వో), ఆర్ఐలు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.అదేవిధంగా నోటీసులు అందుకున్న వ్యక్తుల నుంచి ఐడీ ప్రూఫ్స్ స్వీకరించే ప్రక్రియ శుక్రవారంతో ముగియనున్నట్లు అధికారులు తెలిపారు.నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సంబంధిత ఐడీ ప్రూఫ్స్ అందజేసి తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని సూచించారు. గడువులోగా అవసరమైన పత్రాలు సమర్పించకపోతే సంబంధిత ప్రభుత్వ రికార్డుల్లో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, బీఎల్ఓ,ఉప సర్పంచ్, చంద్రశేఖర్, అధికారులు,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయకుని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- **వెల్జాల్ బాల గణపతి కమిటీ చిన్నారుల వినూత్న సందేశం**



**తలకొండపల్లి , సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** పర్యావరణ పరిరక్షణపై సమాజంలో అవగాహన కల్పించేందుకు తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని బాల గణపతి కమిటీ చిన్నారులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు మట్టి గణనాధుని ఉచితంగా పంపిణీ చేసిన వెల్జాల్ బిజెపి సీనియర్ నాయకుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ...మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని, నిమజ్జనం అనంతరం మట్టి సహజంగా కలిసిపోతుందని చిన్నారులు తెలిపారు.రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని సందేశాన్ని అందించారు.పర్యావరణ పరిరక్షణకు బాట వినాయకుడిని మట్టితో తయారు చేసి పూజించడం మన సంప్రదాయంలో భాగమని, ప్రకృతితో ముడిపడిన మట్టి గణనాథుడిని పూజించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.చెరువులు, కుంటలు, నదులు వంటి నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడేందుకు రసాయన రహిత మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు.చిన్నారులే ముందడుగు వేసి మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ద్వారా పెద్దలకు కూడా మంచి సందేశాన్ని అందించారు. 'మట్టి వినాయకుని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అభినందనీయం అని గ్రామస్తులు పేర్కొన్నారు.నవరాత్రుల సందర్భంగా మట్టి గణనాథుడికి ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బాల గణపతి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల గణపతి ఉత్సవ కమిటీ చిన్నారులు, నేటి శుభోదయ రిపోటర్ విజయ్ యాదవ్, కృష్ణయ్య గౌడ్,శ్రీనివాలు,టిఆర్ఎస్ నాయకులు రామ్, నాయకులు శేఖర్,శంకర్ యాదవ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అంధత్వ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి - డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్

**వికారాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: అంధత్వ రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఆరోగ్యశాఖాధికారి సుధాకర్ లాల్ తెలిపారు. కుల్కచర్ల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 35 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు.విద్యార్థుల్లో చిన్న వయసులోనే దృష్టి లోపాలను గుర్తించి, అవసరమైన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే కంటి సమస్యలను నివారించవచ్చని సుధాకర్ లాల్ పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడంపై వైద్యశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అనే సూక్తిని గుర్తు చేస్తూ, మానవ శరీరంలోని అవయవాల్లో కళ్లకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. చూపు సక్రమంగా ఉంటేనే విద్యార్థులు చదువుతో పాటు తమ రోజువారీ కార్యకలాపాలను ఆనందంగా కొనసాగించగలరని చెప్పారు. విద్యార్థులు కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని, దృష్టిలో ఏమైనా ఇబ్బందులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.అంధత్వ నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్ కుమార్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ జవహర్ లాల్, సర్పంచ్ అంజిలయ్య, ఆర్బీఎస్కే వైద్యాధికారి మనీష్ కుమార్, ఫార్మసీ అధికారి నరేందర్, ఎంపీహెచ్ఈఓ రామనర్సయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** శామీర్‌పేట్ మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి శామీర్‌పేట్ గ్రామానికి చెందిన దివంగత గుల్యగారి ఆంజనేయులు గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సహకారం అందించారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి వచ్చిన భక్తులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, రాజీవ్ రహదారి మీదుగా ప్రయాణిస్తూ ఆలయాన్ని సందర్శించిన భక్తులు పెద్ద



సంఖ్యలో అన్నప్రసాదం స్వీకరించారు.అన్నదానం కార్యక్రమం భక్తుల సేవాభావానికి ప్రతీకగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి సహకరించిన దివంగత ఆంజనేయులు గౌడ్ కుటుంబ సభ్యులకు గౌడ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



# వెల్జాల్‌లో వాడవాడలా వినాయక మండపాలు

- **భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు.. ఘనంగా ప్రారంభం**





**తలకొండపల్లి , సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్ గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని వాడవాడలా వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. వివిధ రూపాల్లో కొలువుదీరిన గణనాథులకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక విగ్రహాలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి, డప్పుచప్పుళ్ల నడుమ మండపాలకు తీసుకొచ్చారు.వినాయక చవితి సందర్భంగా గ్రామంలో పూజా సామగ్రి, ఇతర వస్తువుల కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. పలువురు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలతో పూజలు నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నిర్వాహకులు కోరారు. పురోహితులు, వేద పండితులు యాదగిరి నరసింహ శాస్త్రి, శ్రీనివాస మూర్తి, గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.వినాయక మండపాన్ని సందర్శించిన నాయకులు గ్రామంలోని 1వ వార్డులో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్, టీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు వానరాశి వెంకటేష్, ఈనాడు విలేకరి విష్ణువర్ధన్ యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం 2వ వార్డులో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల కోరిక మేరకు సుమారు రూ.లక్ష వ్యయంతో నిర్మించిన వినాయక మండపం షెడ్డును సోమవారం సాయంత్రం ప్రారంభించారు.మండపం నిర్మాణంలో సర్పంచ్ వానరాశి రాములమ్మ తనయుడు వానరాశి వెంకటేష్ భాగస్వామ్యం వహించారు.ఈ కార్యక్రమం అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వచ్చిన అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో కొలువుదీరిన గణనాథులను నాయకులు, వార్డు సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు,మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన జైపాల్‌రెడ్డి



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి సందర్శించారు. దేవరయాంజాల్, తూంకుంట, పోతాయిపల్లి, హకీంపేట్ ప్రాంతాల్లో యూత్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి వినాయకుడిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జైపాల్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా మండపాల వద్దకు చేరుకున్న జైపాల్‌రెడ్డికి నిర్వాహకులు, యువత ఘనంగా స్వాగతం పలికారు. తనను ఆహ్వానించి, ఆత్మీయంగా స్వాగతించిన యూత్ అసోసియేషన్ సభ్యులు, మండపాల నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జైపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. పండుగ సందర్భంగా యువత, మండపాల నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేడుకలను నిర్వహించాలని సూచించారు.

# చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- **7.10 గ్రాముల బంగారం, ద్విచక్రవాహనం స్వాధీనం**

**నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన కేసును నేరేడ్‌మెట్ పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 7.10 గ్రాముల కరిగించిన బంగారం, నేరానికి ఉపయోగించిన నల్లరంగు స్ప్లెండర్ ప్లస్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 12న నేరేడ్‌మెట్ శివనగర్ కాలనీలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని దుండగులు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ ఏ. వెంకటయ్య ఆధ్వర్యంలో ఎస్ఐలు సాయి అవినాష్, జి. పుల్లారెడ్డి, క్రైమ్, సైబర్ క్రైమ్ బృందాలు రంగంలోకి దిగాయి. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరాల దృశ్యాలతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు.ఈ క్రమంలో రిహాన్ అహ్మద్ (ఏ1), మహ్మద్ సోను (ఏ2), ఆసిమ్ (ఏ3)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 7.10 గ్రాముల కరిగించిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన నల్లరంగు స్ప్లెండర్ ప్లస్ వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.కేసు ఛేదనలో నేరేడ్‌మెట్ క్రైమ్ టీమ్, సైబర్ క్రైమ్ టీమ్ కీలకంగా వ్యవహరించాయని ఇన్‌స్పెక్టర్ ఏ. వెంకటయ్య తెలిపారు.

# పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసా

- **ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్....**



**నిజామాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** నిజామాబాద్ పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ....అనారోగ్యం,ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద,మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని అన్నారు.ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి,ఆపద సమయంలో వారికి అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే సీఎంఆర్‌ఎఫ్ పథకం అనేక కుటుంబాలకు ఉపశమనం కల్పిస్తూ,వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు.నిజామాబాద్ పట్టణంలోని వివిధ డివిజన్లకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.32 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు షబ్బీర్ అలీ వెల్లడించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం మరింత చేరువయ్యేలా ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పారదర్శకంగా అమలవుతోందని షబ్బీర్ అలీ అన్నారు.ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా,పైరవీలు,అదనపు ఖర్చులకు తావు లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.నిజమైన అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్‌ఎఫ్ వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి,అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని షబ్బీర్ అలీ కోరారు.ఈ కార్యక్రమంలో ఆకుల లలిత,డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి,బొబ్బిలి రామకృష్ణ,జావిద్ అక్రమ్,కరీం,రత్నాకర్,ఫహీం,అరుణ్ ఖాన్,హాఫిజ్ లైక్ ఖాన్,అహ్మద్,నయీమ్ షహరాన్,పాపా ఖాన్,జాఫర్ హుస్సేన్,వహీద్,ముజాహిద్ ఖాన్,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# కుల్కచర్లలో అక్రమ కలప వ్యాపారంపై ఆరోపణలు

- **అనుమతులు లేకుండానే చెట్ల నరికివేత.. అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని స్థానికుల ఆవేదన**

**వికారాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: కుల్కచర్ల మండలంలో అక్రమ కలప వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే చెట్లను నరికివేసి కలపను ఇటుక బట్టీలు, నగర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో అక్రమ నరికివేతలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెట్ల నరికివేత, కలప తరలింపుపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినప్పటికీ తగిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా అక్రమంగా చెట్లు నరికివేస్తున్నారనే సమాచారాన్ని అధికారులకు అందించిన వారి వివరాలను కలప వ్యాపారులకు చేరవేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో సమాచారం ఇచ్చిన వారితో కలప వ్యాపారులు గొడవలకు దిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు అంటున్నారు.మరోవైపు కొందరు కలప



వ్యాపారులు తమను ఎవరూ ఏమీ చేయలేరంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, వివిధ శాఖల అధికారులకు నెలనెలా ముడుపులు చెల్లిస్తున్నామని చెప్పుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులను సంప్రదించగా స్పష్టమైన సమాధానం లభించడం లేదని పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలను అధికారులు నిర్ధారించాల్సి ఉంది.కలప అక్రమ రవాణా వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. చెట్ల నరికివేత, కలప తరలింపు వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు



కోరుతున్నారు. అలాగే అక్రమ వ్యాపారానికి అధికారుల సహకారం ఉందన్న ఆరోపణలపైనా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఐ.డీ.ఓ.సీలో వినాయకునికి భక్తి శ్రద్ధలతో పూజలు





**నిజామాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణం(కలెక్టరేట్ )లో ప్రతిష్ఠించిన వినాయకుడికి మంగళవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు.వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు పాల్గొనగా,వేద బ్రాహ్మణులచే సాంప్రదాయబద్ధంగా పూజాదికాలు జరిపించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.విఘ్నాలు తొలగించే ఆది దేవుడు విఘ్నేశ్వరుని కృపతో అంతటా శాంతి సౌభాగ్యాలు సమకూరాలని అదనపు కలెక్టర్ భుజంగరావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు,సూపరింటెండెంట్ శ్రీనివాస్,అన్ని శాఖల అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**శంషాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను శంషాబాద్ మండల విద్యాశాఖ ఘనంగా సత్కరించారు. మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మ మహేందర్, మండల పరిషత్ అధికారి మున్నీ ముఖ్య అతిథులుగా హాజరై ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆరుగురు జిల్లా అవార్డు గ్రహీతలు, 20 మంది మండల ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థుల నమోదు శాతం పెంచిన సాతంరాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పురస్కారాలు



అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, సమాజ అభివృద్ధికి వారి సేవలు ఎంతో అవసరమన్నారు. సుష్మ మహేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వారి సేవలను కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేసిన కృషిని గుర్తిస్తూ అవార్డులు అందజేస్తున్నట్లు మున్నీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, మోహన్ రావు, బాల స్వామి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాల్ రెడ్డి, వీరమల్లేష్, భాస్కర్, బాలరాజ్, మండల ఉపాధ్యాయులు, మండల వనరుల కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# నాగోల్ చెరువు వద్ద జరుగుతున్న వాకింగ్ ట్రాక్ పనులు

- **లైటింగ్ సిస్టం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్**

**నాగోల్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోల్ చెరువు వద్ద జరుగుతున్న వాకింగ్ ట్రాక్ పనులు, లైటింగ్ సిస్టం మరియు పరిసర ప్రాంతాలను నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్, క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్ పనుల పురోగతిని పరిశీలించి, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం వచ్చే వృద్ధులు, మహిళలు, యువతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాక్‌ను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు.అలాగే నాగోల్ చెరువు పరిధిలో లైటింగ్ సిస్టంను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు పనిచేయని లైట్లను వెంటనే మరమ్మతులు చేసి రాత్రి వేళల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో వెలుతురు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని నాగోల్ చెరువు



వద్ద చేపట్టాల్సిన నిమజ్జన ఏర్పాట్లను కూడా పరిశీలించారు.నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, భద్రత, లైటింగ్, పారిశుద్ధ్యం, బారికేడింగ్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.నిమజ్జన సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేయాలని కోరారు.

# నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ** ప్రజా సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న కృషి అభినందనీయమని దివంగత మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మనవడు బూర్గుల విజయకుమార్ అన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రజాప్రతినిధులు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.మంగళవారం షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బూర్గుల విజయకుమార్ సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కళాశాల భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందించాలనే లక్ష్యంతో ఇంత పెద్ద స్థాయిలో నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.



కళాశాల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడంతో పాటు స్వచ్ఛందంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. పేద విద్యార్థులు అన్ని వసతులతో నాణ్యమైన విద్యను అభ్యసించేలా కళాశాల నిర్మాణం చేపట్టడం గొప్ప సంకల్పానికి నిదర్శనమన్నారు.ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ విశేషాలను మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వావిలాల సుజీవన్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయ కార్యదర్శి, ఉప సర్పంచ్ అశోక్, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ తదితరులు బూర్గుల విజయకుమార్‌కు వివరించారు.

# దళిత బాలికల హాస్టల్‌ను అన్ని సౌకర్యాలతో కూడిన భవనంలోకి మార్చాలి





**మహబూబాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** కురవి మండల కేంద్రంలోని దళిత బాలికల వసతి గృహాన్ని అన్ని మౌలిక సదుపాయాలు, సకల హంగులతో కూడిన సురక్షితమైన నూతన భవనంలోకి వెంటనే మార్చాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీకి నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా దళిత విద్యార్థినులు నివాసానికి అనుకూలంగా లేని పాత పెంకుటింటిలో కొనసాగుతున్న హాస్టల్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినుల విద్య, ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వసతి తదితర అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.సకల సౌకర్యాలతో కూడిన నూతన భవనంలోకి విద్యార్థినులను 2026 జూలై 15న తరలించాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న హాస్టల్ భవనం యజమాని అభ్యంతరాల కారణంగా తరలింపు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని వారు తెలిపారు. విద్యార్థినుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి,



హాస్టల్‌ను నూతన భవనంలోకి మార్చడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.దళిత బాలికలకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పిరయ్య , దళిత రత్న అవార్డు గ్రహీత, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు దైద భద్రయ్య, సావిత్రిబాయి అవార్డు గ్రహీత కిన్నెర మల్లయ్య, కురవి మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు ఇరుగు వెంకన్న, దైద సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**శామీర్‌పేట, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం మండల విద్యాధికారి ఆర్. కమలాకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలియాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కంటం శిరీషా కృష్ణారెడ్డి, ఆత్మీయ అతిథులుగా జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు.2026 సంవత్సరానికి మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా బాలమణి (సామాజిక శాస్త్రం), కె. రవీందర్ రెడ్డి (గణితం), హేమలత (తెలుగు), రాంబాబు, లక్ష్మీనారాయణ, ఉమా శంకర్, రాఘవేందర్ రెడ్డి, సందీప్, యశస్విని, సౌమ్య, నిహారిక, శివ నాగరాజు, మునీత, వి. ప్రసన్నలను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు.అదేవిధంగా శామీర్‌పేట మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఆరుగురు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సత్కరించారు. జెతాధరా విద్యా సంస్థల ప్రతినిధులు కూడా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ద్వారా మరింత మంది ఉపాధ్యాయులకు స్ఫూర్తి కలుగుతుందని అన్నారు.కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ మేడ్చల్–మల్కాజగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్రామ్ రెడ్డి, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. రాజు, టీఎస్‌యూటీఎఫ్ శామీర్‌పేట మండల అధ్యక్షుడు పి. తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి యు. కుమార్, పీఆర్‌టీయూ శామీర్‌పేట మండల అధ్యక్షుడు డి. మహేష్, ప్రధాన కార్యదర్శి ఎం. గోపాల్, ఎస్టీయూ మండల అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

# విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- **బీజేపీ నాయకుల డిమాండ్**



**మంథని, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాఖ పిలుపు మేరకు మంగళవారం మంథని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు చాటిచెప్పేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.విమోచన దినోత్సవాన్ని ప్రతిఏటా అధికారికంగా నిర్వహించడంతో పాటు హైదరాబాద్‌లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ విమోచన మ్యూజియాన్ని నిర్మించి, నాటి చరిత్రకు సంబంధించిన ఆధారాలు, సంఘటనలను భద్రపరచాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో 'విమోచన స్ఫూర్తి కేంద్రాలు' ఏర్పాటు చేసి స్థానిక అమరవీరులు, పోరాట యోధుల చరిత్రను ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.రజాకార్ల దురాగతాలు, నిజాం పాలన, తెలంగాణ విమోచన ఉద్యమం, ఆపరేషన్ పోలో తదితర చారిత్రక అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్మారక స్తూపాలను ఏర్పాటు చేయడంతో పాటు విమోచనకు సంబంధించిన ముఖ్య ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, బోగోజు శ్రీనివాస్, బూడిద తిరుపతి, రాపర్తి సంతోష్, నారమల్ల కృష్ణ, సామల అశోక్, ఎడ్ల సాగర్, గుడ్ల గురువేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా రవాణా అధికారికి టీఆర్‌పీ నాయకుల శుభాకాంక్షలు



**మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా నూతన రవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దేవునూరి శ్రీనివాస్‌ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీఆర్‌పీ నాయకులు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు రవాణా శాఖ సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. రవాణా శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, అవినీతికి తావులేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. నూతన అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడు మేరుగు చందర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మేరుగు సతీష్ గౌడ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కాంపెల్లి స్వామి, జిల్లా కార్యదర్శి కుమ్మరి పరమేష్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫరీద్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు వెంగళ కృష్ణ, టీఆర్‌పీ నాయకులు ధార మధు, గుండేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ నెలాఖరులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని/పెద్దపల్లి, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.పాఠశాలల మరమ్మతులు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈలు, ఏఈలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపంలో విద్యుత్ భద్రతపై అవగాహన



**కూకట్‌పల్లి , సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాలనగర్ లో అక్షయఎంక్లేవ్ ఇండస్ట్రీస్ ఓనర్స్ అసోసియేషన్ వినాయక మండపం వద్ద విద్యుత్ భద్రతా సూచనలతో కూడిన కరపత్రాన్ని నిర్వాహకులకు అందజేసి పలు జాగ్రత్తలను వివరించారు.విద్యుత్ తీగలకు మండపాలు, అలంకరణలు దూరంగా ఏర్పాటు చేయాలని, తెగిపోయిన విద్యుత్ తీగలను తాకరాదని సూచించారు. మండపాల్లో నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని, సరైన ఎర్తింగ్, ఎంసీబీ వంటి భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలని తెలిపారు.అలాగే మండపాల్లో విద్యుత్ తీగలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, ఉత్సవ నిర్వాహకులు ప్రెసిడెంట్ దిద్ది ప్రభాకర్, కె కోటేశ్వరరావు వైస్ ప్రెసిడెంట్, జి భాస్కర్ జనరల్ సెక్రటరీ, జి కిషోర్ జాయింట్ సెక్రటరీ , ఎన్ సుధాకర్ కోశాధికారి , ఏ రాజు పాల్గొన్నారు.

## మతాలకు అతీతంగా భక్తి.. సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్న ముస్లిం దంపతులు.



**కొత్తపేట, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** కొత్తపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్‌లో ముస్లిం దంపతులు గత మూడు సంవత్సరాలుగా వినాయకుడిని ప్రతిష్టిస్తూ, మత సామరస్యానికి, సోదరభావానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.వినాయక చవితి సందర్భంగా ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో వినాయకుడిని ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తూ, అన్ని మతాల పట్ల గౌరవం మరియు పరస్పర సోదరభావాన్ని చాటుతున్నారు.కొన్నేళ్ల క్రితం వినాయకుడి లడ్డూను ప్రసాదంగా స్వీకరించిన అనంతరం తమ జీవితంలో మంచి పరిణామాలు చోటుచేసుకున్నాయని వారు విశ్వసిస్తున్నారు.అప్పటి నుంచి వినాయకుడిపై మరింత భక్తి, విశ్వాసంతో ప్రతి సంవత్సరం వినాయక ప్రతిమను ప్రతిష్టిస్తూ తమ ఆధ్యాత్మిక భావాన్ని కొనసాగిస్తున్నారు.వారి ఈ ప్రత్యేకమైన భక్తి, మత సామరస్యానికి సంబంధించిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్,వారిని తన కార్యాలయానికి ఆహ్వానించి ఆత్మీయంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి, మతాలకు అతీతంగా భక్తి, ప్రేమ, సోదరభావంతో ముందుకు సాగుతున్న వారి ఆలోచనలను అభినందించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ కౌన్సిల్ సభ్యురాలు కాటా విజయ గౌడ్, కొత్తపేట వాస్తవ్యులు శోభ, నేమూరి శరన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కురవి మండల సమాఖ్య అధ్యక్ష ఎన్నికపై విచారణకు డిమాండ్

- **ఎన్నికను రద్దు చేసి రహస్య బ్యాలెట్‌తో తిరిగి నిర్వహించాలని సభ్యుల వినతి**



**మహబూబాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**
కురవి మండల సమాఖ్య అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, ఎన్నికపై సమగ్ర విచారణ జరిపి, ప్రస్తుత ఎన్నికను రద్దు చేసి రహస్య బ్యాలెట్ విధానంలో తిరిగి ఎన్నిక నిర్వహించాలని కోరుతూ మండల సమాఖ్యకు చెందిన పలువురు సభ్యులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. అధ్యక్ష ఎన్నికను రహస్య బ్యాలెట్ విధానంలో నిర్వహించాల్సిన చోట బహిరంగంగా ఓటింగ్ నిర్వహించారని ఆరోపించారు. బహిరంగ ఓటింగ్ కారణంగా కొంతమంది సభ్యులు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారని పేర్కొన్నారు.అలాగే, ప్రస్తుతం ఎన్నికైన అభ్యర్థికి మద్దతుగా పలువురు సభ్యుల నుంచి వారి స్వచ్ఛంద సమ్మతి లేకుండానే సంతకాలు తీసుకున్నట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. కొంతమంది సభ్యులు తమ సంతకాలు ఒత్తిడిలో తీసుకున్నట్లు అధికారులకు అభ్యంతరాలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై సంబంధిత సభ్యుల వాంగ్మూలాలను నమోదు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.మండల సమాఖ్య అధ్యక్ష ఎన్నికను రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని పలుమార్లు కోరినప్పటికీ, తమ విజ్ఞప్తిని పట్టించుకోకుండా బహిరంగ ఓటింగ్ నిర్వహించారని సభ్యులు ఆరోపించారు. దీంతో ఎన్నికల పారదర్శకత, నిష్పక్షపాతత్వంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.అదేవిధంగా, ప్రస్తుతం ఎన్నికైన అధ్యక్షురాలు కడారి స్వరూప సమ్మక్క సారక్క దాదాపు 13 సంవత్సరాలుగా అదే నాయకత్వ పదవిలో కొనసాగుతున్నారని సభ్యులు పేర్కొన్నారు. ఒకే వ్యక్తి ఇంతకాలం పదవిలో కొనసాగడంపై సంబంధిత SERP నిబంధనలు, పదవీ కాలం, అర్హత ప్రమాణాలను అధికారులు పరిశీలించాలని కోరారు.అధ్యక్షురాలి నివాస అర్హతతో పాటు ఎన్నికకు సంబంధించిన ఇతర అర్హతలను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఒకే వ్యక్తి దీర్ఘకాలం పదవిలో కొనసాగడం వల్ల ఇతర అర్హత కలిగిన మహిళలకు నాయకత్వ అవకాశాలు దక్కకుండా పోతున్నాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సభ్యులు అధికారులను కోరిన ప్రధాన డిమాండ్లు:
. కురవి మండల సమాఖ్య అధ్యక్ష ఎన్నికలపై స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలి.
. ఒత్తిడితో సంతకాలు తీసుకున్నట్లు చెబుతున్న సభ్యుల వాంగ్మూలాలను నమోదు చేయాలి.
. ఎన్నిక SERP నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగిందో పరిశీలించాలి.
. ఎన్నికైన అధ్యక్షురాలి అర్హత, పదవీకాలం, నివాస అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలించాలి. అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే ప్రస్తుత ఎన్నికను రద్దు చేయాలి. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రహస్య బ్యాలెట్ విధానంలో తిరిగి ఎన్నిక నిర్వహించాలి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులు లేదా అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.
మహిళా సాధికారత, పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని మండల సమాఖ్య సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో సంగెం హారిక, కొణతం సరస్వతి, మధ్యాహ్నపు రజిని, బుడమ సబిత, రాగిరి ఉమ, ఆమెడ లలిత, సిలివేర్ లక్ష్మి , లింగరబోయిన పార్వతి, మద్దోజ శ్రీదేవి, బత్తిని సుశీల తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు నిలిపివేయాలి

- **అధికారులకు పుట్టవానిగూడ గ్రామస్థుల వినతి**



**కేశంపేట, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**
కేశంపేట మండలంలోని పుట్టవానిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని సంగెం గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో జరుగుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని గ్రామస్థులు అధికారులను కోరారు. సర్వే నంబర్ 206లో ఉన్న 8 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిలో కొంతకాలంగా మట్టి తవ్వకాలు చేపట్టి, మట్టిని తరలించి విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు.ఈ మేరకు సంబంధిత అధికారులకు గ్రామస్థులు దరఖాస్తు సమర్పించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నంబర్ 206లో ప్రకృతి వనం ఏర్పాటు చేసినందున భూమిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామపంచాయతీ తీర్మానం మేరకు ఈ భూమికి ఎలాంటి అనుమతులు జారీ చేయకుండా చూడాలని కోరారు. అక్రమంగా మట్టి తవ్వకాలు, తరలింపులకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎల్‌హెచ్‌పీఎస్ కేశంపేట మండల అధ్యక్షుడు జరుపుల రాజు నాయక్, జంగా శేఖర్, మాజీ వార్డు సభ్యుడు పట్నం కుమార్, స్థానిక వార్డు సభ్యుడు, టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు యాదవ్, పట్నం రాజు, కాసారం శ్రీశైలం, ప్రభాకర్ యాదవ్, అంజి యాదవ్, వేముల శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శిగా ఆరెల్లి కిరణ్ గౌడ్



**మంథని, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యదర్శిగా ఆరెల్లి కిరణ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంథని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కిరణ్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ తనకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మండల, జిల్లా స్థాయిలో సోషల్ మీడియా విభాగంలో పనిచేసిన అనుభవంతో కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.కాంగ్రెస్ పార్టీ విధానాలు, కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసిన కంజర్ల కృష్ణమూర్తి..



**పటాన్ చేరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**
భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్, కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ చైర్మన్ కంజర్ల కృష్ణమూర్తి , బిజెపి నాయకురాలు సునంద కృష్ణమూర్తి వినాయక చవితి పండుగ సందర్భంగా భారతి నగర్ డివిజన్లోని ఎల్ఐజీ కాలనీలో మట్టి గణపతులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నంద రెడ్డి, రాములు, శశిధర్ ఎల్లారెడ్డి, సాయి వెంకట హర్షా,రాజేందర్ చారి, వంశీ, అధిక సంఖ్యలో కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కంజర్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీ నగర్ డివిజన్ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసి,అందరినీ మట్టి వినాయకులనే పూజించాలని కోరారు, మట్టి గణపతిని పూజించి మన పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అని, అవి నాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ తమ చేపట్టే కార్యక్రమాలు విజయాలు సాధించాలని కోరుకున్నారు.

# తెలంగాణ దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి : సాయి ప్రసాద్ గౌడ్



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బౌద్ధనగర్ బీజేపీ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ మంగళవారం బౌద్ధనగర్ బీజేపీ నేతలు ముషీరాబాద్ మండల తహశీల్దార్ చందనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాదులో తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయాలని నిజాం రజాకారుల దురగతాలు, ఆపరేషన్ పోలో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనానికి సంబంధించిన చారిత్రక ఆధారాలను మ్యూజియంలో ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. పాఠ్యపుస్తకాలలో తెలంగాణ విమోచన చరిత్ర అజ్ఞాత వీరుల అధికారిక జాబితా, జమీందారీ, జాగిరిదారి ప్రజా పోరాటం, పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వర్రెడ్డి. మున్సిపల్ సెల్ కన్వీనర్ నగరపు శ్యామ్, జయంత్, రూప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలలుగా జీతాలు లేక మున్సిపల్ కార్మికుల ఆందోళన

- కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలి: మల్కాపురం చైతన్య కిరణ్



**వికారాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వికారాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో చేపట్టిన ధర్నా, ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, అడ్వకేట్ మల్కాపురం చైతన్య కిరణ్ పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. పట్టణ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిరోజూ కష్టపడుతున్న కార్మికులు తమ కుటుంబాల పోషణకు జీతాలపైనే ఆధారపడుతున్నారని, అలాంటి వారికి నెలల తరబడి వేతనాలు అందకపోవడం ఆందోళనకరమని అన్నారు.స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని వికారాబాద్ మున్సిపాలిటీలో, మున్సిపల్ చైర్మన్‌గా ఆయన కుమార్తె ఉన్న సమయంలో కార్మికులు జీతాల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చైతన్య కిరణ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి, వారికి భరోసా కల్పించారని పేర్కొన్నారు.మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, సమస్య పరిష్కారమయ్యే వరకు వారికి మద్దతుగా నిలుస్తామని చైతన్య కిరణ్ తెలిపారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్, మైలార్ దేవ్‌పల్లి విభాగ కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్. ధనుంజయ లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్ కార్డుల వలన పారదర్శకంగా, సులభంగా రేషన్ సరుకులు అందుతాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. ప్రేమ్ గౌడ్, ఇంద్రపాల్ రెడ్డి, సరికొండ వెంకటేష్, బొల్లా వెంకటేష్, భాషా, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, సోమ శ్రీనివాస్ రాయుడు, కిషోర్, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా హైదర్ గూడలో వినాయక పూజ




**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్ గూడలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమానా క్ర అంతర్జాతీయ క్రీడాకారిణి అరుణా రెడ్డి ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అరుణా రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి నెలకొనాలని, ప్రజలందరిపై విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, పండుగను ఐక్యతతో జరుపుకోవాలని కోరారు. హైదర్ గూడలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుడి ఆశీస్సులు పొందారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. విఘ్నాలు తొలగించి విజయాలు ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని అరుణా రెడ్డి ఆకాంక్షించారు.

# ప్రేమ వివాహం.. ఆపై వేధింపులు

- బావిలో దూకి వివాహిత మృతి.. అదనపు కట్నం కోసం వేధించారని ఆరోపణలు



**డిండి( గుండ్లపల్లి ), సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** నల్గొండ జిల్లా డిండి మండలం మూలతండా శివారులో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధించడంతో మనస్తాపానికి గురైన వివాహిత బావిలో దూకి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూలతండాకు చెందిన నాగమణి (21)కి సుమారు 18 నెలల క్రితం ఆంజనేయులుతో ప్రేమ వివాహం జరిగింది. వివాహం అనంతరం అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ, మరియు కుటుంబ సభ్యులు గత కొన్ని నెలలుగా వేధిస్తున్నారని మృతురాలి తండ్రి వెంకటయ్య ఆరోపించారు. ఈ వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగమణి సోమవారం బావిలో దూకి మృతి చెందినట్లు తెలిపారు.మృతురాలి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిండి ఎస్సై సీహెచ్ బాలకృష్ణ వెల్లడించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# గంజాయి సరఫరా, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు నివారణపై ప్రత్యేక దృష్టి పట్టాలి

- నేర సమీక్షా సమావేశం లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** గంజాయి వినియోగించే అవకాశం ఉన్న నిర్మానుష ప్రాంతాలు, శివారు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలు, పాడుబడిన భవనాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు.పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిర్మానుష ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి వినియోగం, విక్రయాలు, సరఫరాకు పాల్పడే వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులను గుర్తించి, వారి నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు వినియోగదారులను కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు నిరంతర నిఘా, తనిఖీలు, అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.సైబర్ నేరాల నియంత్రణకు సమర్థవంతమైన వ్యూహంతో ముందుకు వెళ్లాలని,సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, నేరాల వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన బాధితుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బ్యాంకులు–ఆర్థిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మోసపోయిన నగదును వీలైనంత త్వరగా ఫ్రీజ్ చేయించి బాధితులకు తిరిగి అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, ఓటీపీ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.ప్రధాన రహదారులు, జంక్షన్లు, ప్రమాదకర మలుపుల వద్ద నిరంతర నిఘా, వాహన తనిఖీలు చేపట్టాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, ఆధారాలను పకడ్బందీగా సేకరించి, నిందితులకు శిక్ష పడే విధంగా కోర్టు కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో పెండింగ్‌లో ఉన్న ఛార్జ్‌షీట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసి కోర్టుల్లో దాఖలు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా ప్రతి కేసును నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని, పెండింగ్ కేసులను అధికారులు స్వయంగా సమీక్షిస్తూ దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, బలమైన ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ రమణమూర్తి, సాంబరాజు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# మా పువ్వాడ మాట, ఆదర్శనీయం

- మరెన్నో జన్మదినోత్సవాలతో మా పువ్వాడ నిండునూరేళ్లు జీవించాలని భగవంతుడికి డాక్టర్ పులిపాటి వేడుకోలు
- మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వర రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వచనాలు పొందిన తెలంగాణ డెవలప్మెంట్ ప్రోగ్రెసివ్ ఫోరం చైర్మన్ డాక్టర్ పులిపాటి ప్రసాద్





**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఆయన మాట వేదం, ఆయన చూపే ఆత్మీయ శాసనం, ఆయన పలుకే యువత భవితకు ఆదర్శప్రాయం, ఆయనే మా తండ్రి సమానులు రాజకీయ దురంధరుడు, కమ్యూనిస్టు కామ్రేడ్ లకు సలహా సూచనల దిక్సూచి, మా పువ్వాడ నాగేశ్వరరావు అని తెలంగాణ డెవలప్మెంట్ ప్రోగ్రెసివ్ ఫోరం చైర్మన్ డాక్టర్ పులిపాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ సిపిఐ జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో భాగంగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ తండ్రి సమానులైన పువ్వాడ నాగేశ్వరరావును ప్రత్యక్షంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆయన ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ డెవలప్మెంట్ ప్రోగ్రెసివ్ ఫోరం చైర్మన్ డాక్టర్ పులిపాటి ప్రసాద్ మాట్లాడుతూ తన బాల్య దశ నుంచి తన ఆర్థిక సామాజిక రాజకీయ తోడ్పాటులో, ఒక తండ్రి వలె తనను ఆదరించారని, తనకు అందించిన సహకారం మమకారాన్ని ఎప్పటికీ మరువనని ఆయన అన్నారు.. సీపీఐ ఎర్రజెండాను రెపరెపలాడించడంలో కీలక పాత్ర పోషిస్తున్న మా పువ్వాడ నాగేశ్వరరావు సూచనలు, ఎందరికో ఆచరణాత్మక మయ్యాయని, తన విషయంలో భవిష్యత్తు తరాలకు జీవితమంటే ఏంటో ఒక గురువుగా నేర్పిన నాకు తండ్రి సమానులు మా పువ్వాడ నాగేశ్వరరావుగారేనని వ్యాఖ్యానించారు. పువ్వాడ నాగేశ్వర రావు మరెన్నో జన్మదినోత్సవాలతో అనేక మంది యువతకు భావి భవితగా మార్గదర్శకులుగా పువ్వాడ సూచనలతో ఆయన నిండునూరేళ్లు జీవించాలని భగవంతుడికి వేడుకుంటున్నానని తెలిపారు.

# ఎంపీ వద్దిరాజు ఇంటి వద్ద విఘ్నేశ్వరుడికి పూజలు





**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వినాయక చవితి సందర్భంగా బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ లోని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నివాసం వద్ద కుటుంబ సభ్యులు పూజలు చేశారు. వద్దిరాజు రవిచంద్ర (వీఆర్సీ)యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా గణేషుడి నవరాత్రోత్సవాలను ఆయన కార్యాలయ ఉద్యోగులు, వ్యక్తిగత సిబ్బంది, శ్రేయోభిలాషులు, అభిమానులు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఎంపీ రవిచంద్ర నివాసం ప్రధాన గేట్ వద్ద నెలకొల్పిన మండపంలో కొలువైన గణనాథుడికి ఆయన ధర్మపత్ని విజయలక్ష్మీ, కుమారుడు నిఖిల్ చంద్రలు పూలదండ వేసి,పసుపు, కుంకుమ, సమర్పించి కొబ్బరికాయలు కొట్టి గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు.వేద పండితుడు వారికి ఆశీస్సులు అందజేసి బొజ్జ గణపయ్య తీర్థ ప్రసాదాలు బహూకరించారు.ఈ పూజా కార్యక్రమంలో రవిచంద్ర- విజయలక్ష్మీ పుణ్య దంపతుల కుమారుడు నిఖిల్ చంద్ర కూతుళ్లు సహస్రిక,తారుణిలు పాల్గొని వినాయకుడి ఆశీస్సులు అందుకున్నారు.

# పాలేపు ఆధ్వర్యంలో వినాయకునికి పూజలు



**ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ లో తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ ఆధ్వర్యంలో పలు చోట్ల వినాయకునికి పూజలు నిర్వహించారు. ఇది ఇలా ఉండగా మర్యాద పూర్వకంగా మమత హాస్పిటల్ రోడ్ లో గల వారి నివాసంలో పాలేపు వారి కుటుంబ సభ్యులతో కలిసి వినాయక చవితి పూజలు నిర్వహించారు. అనంతరం వారి అభిమానులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 44 వ డివిజన్ మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసిన 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్





పాలేపు విజయ వెంకటరమణ.

# విద్యానగర్ కాలనీ లో గల వినాయకుని వద్ద యెగినాటి దంపతుల ఆధ్వర్యంలో పూజలు



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 58 వ డివిజన్ లో గల రాపర్తి నగర్ 2 విద్యానగర్ కాలనీ నందు శ్రీ వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం నందు మంగళ వారం ప్రత్యేక పూజ కార్యక్రమాని నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో యెగినాటి మాధవరావు, ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఏం సింహారెడ్డి, కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు , కోశాధికారి జవ్వాజి శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. విద్యానగర్ నందు రెండవ సంవత్సరం కార్యక్రమం విజయవంతంగా నడుస్తుంది. భక్తులంతా సహకరిస్తూ ముందుకు పోతున్నాం అని శ్రీ వినాయక ఉత్సవ కమిటీ, విద్యానగర్, రాపర్తి నగర్ 2 నిర్వహకులు తెలిపారు.

# "రానున్న 3 నెలలు తస్మాత్ జాగ్రత్త"

- భారత్‌కు 44 ఏళ్లలో ఎన్నడూ లేని పెనుతుపాను ముప్పు ఇస్రో షాకింగ్ హెచ్చరిక

**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** 2026 చివరి మూడు నెలలైన అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో భారత తీర ప్రాంతాల్లో తుపాను కార్యకలాపాలు విపరీతంగా పెరిగే అవకాశముందని వాతావరణ అంచనాలు హెచ్చరిస్తున్నాయి.ఉత్తర హిందూ మహాసముద్ర పరిధిలో సుమారు 3 ఉష్ణమండల తుపానులు (ట్రాపికల్ సైక్లోన్లు) ఏర్పడే అవకాశముంది. సాధారణంగా వర్షాకాలం ముగిసిన తర్వాతి ఈ సమయం బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో తుపానుల ఏర్పాటుకు అనుకూలమైనదే అయినప్పటికీ ఈసారి ఏర్పడబోయే తుపానుల గమనం తీరప్రాంత రాష్ట్రాల్లో తీవ్ర వాతావరణ మార్పులకు దారితీయవచ్చని తెలుస్తోంది.ముఖ్యంగా తుపానుల మొత్తం విధ్వంసక శక్తిని కొలిచే 'పవర్ డిసిపేషన్ ఇండెక్స్' (పిడిఐ) ఆధారంగా.. ఇది 1982 నుంచి 2025 వరకు గడిచిన 44 ఏళ్ల సగటు తో పోలిస్తే సుమారు 83 శాతం అధికం. దీని ప్రభావంతో అరేబియా సముద్రంలో తుపాను ఏర్పడితే గుజరాత్, మహారాష్ట్ర సహా పశ్చిమ తీర రాష్ట్రాలు, అలాగే బంగాళాఖాతంలో ఏర్పడితే తమిళనాడుతో పాటు తూర్పు తీర రాష్ట్రాలు ఈదురు గాలులు, కుండపోత వర్షాలు, తీవ్ర సముద్ర అలజడులను ఎదుర్కోవాల్సి రావచ్చుఅయితే, ఇది రుతుపవన పరిస్థితుల ఆధారంగా వేసిన ముందస్తు అంచనా మాత్రమే కాబట్టి.. ఫలానా నిర్దిష్ట ప్రాంతంలో తుపాను కచ్చితంగా తీరాన్ని దాటుతుందని ఇప్పుడే స్పష్టంగా చెప్పలేము. తుపాను పూర్తిస్థాయిలో కేంద్రీకృతమైన తర్వాతే దాని కదలిక దిశ, వేగం, తీరం దాటే కచ్చితమైన ప్రాంతాన్ని అంచనా వేయడం సాధ్యమవుతుంది. కాబట్టి రాబోయే నెలల్లో భారత తీరప్రాంతాల్లో సంభవించే వాతావరణ మార్పులను విపత్తు నిర్వహణ విభాగంతో పాటు సాధారణ ప్రజలు కూడా నిశితంగా గమనించడం ఎంతో అవసరం.

# 17న శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 17న ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్ర పటానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గా మదూరి

- సైదారావును నియమిస్తూ రాష్ట్ర జేఏసీ ఉత్తర్వులు
- మదూరిని సన్మానించిన పలువురు పుర ప్రముఖులు



**ఖమ్మం, సెప్టెంబర్ 15 నేటి శుభోదయ :** మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గా ఖమ్మం నగరానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మదూరి సైదారావు నియమితుల య్యారు. ఈ మేరకు మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్ ఉత్తర్వులు విడుదల చేశారు. మదూరి సైదారావు తాజాగా క్రియాశీల రాజకీయాల్లో చైతన్యవంతమైన పాత్ర పోషిస్తున్నారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో పలు కీలక హోదాలను బాధ్యతాయుతంగా నిర్వర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు సన్నిహితుడుగా మెలుగుతున్నారు. అలాగే మున్నూరు కాపు జేఏసీలో ఆయనకు క్రియాశీల గుర్తింపు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గా మదూరి సైదారావును నియమించడం పట్ల పలువురు ఖమ్మం నగర ప్రముఖులు ఆయనను కలిసి సన్మానించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, 39వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మదూరి ప్రసాద్, రైల్వే గేట్ ఆంజనేయ స్వామి దేవాలయ సంస్థ చైర్మన్ ఖాజా మురళి, ఊరికొండ రవి, చిలుకోటి శ్రీనివాస్ తదితరులు సైదారావు ఇంటికి వెళ్లి శాలువాలతో సత్కరించారు. అటు రాజకీయంగాను ఇటు మున్నూరు కాపు జేఏసీలోనూ గుర్తింపు పొందుతున్న సైదారావు భవిష్యత్తులో మరిన్ని కీలక పదవలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# ఘనంగా వినాయక పూజలు





**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఖమ్మం పట్టణంలోని సహకార నగర్ లో గల ప్రసాద్ హైట్స్ అపార్ట్మెంట్స్ లో వినాయక చవితి పర్వ దినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్య క్రమాలు నిర్వహిం చడం జరిగింది. ప్రతిరోజు వినాయక చవితి నవరాత్రి ఉత్స వాలను పురస్కరించుకొని ఉదయం సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు.

## మోతారపు ఆధ్వర్యంలో వినాయక పూజలు



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 55వ డివిజన్ సిద్దివినా యక కమిటీ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సదాకర్ అధ్య క్షతన వినాయక వేడుకలు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ శాసనమండలి సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ దంపతులు, కొంగర వెంకటేశ్వర రావు, ఉన్నం వెంకటేశ్వ రావు, వేగినటి మధు, కృష్ణ, రామ్ మూర్తి, వాసయ్య పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## మధురా నగర్ సాయిబాబా గుడి లో గణేష్ నవరాత్రులు



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తు న్నారు.ఈ గణేష్ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గణపతి పూజకు 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కూరాకుల వల్లరాజు, లక్ష్మి దంపతులు పీటల మీద కూర్చున్నారు. ఈ కార్యక్ర మంలో కమిటీ సభ్యులు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్దలతో గణపతిని పూజించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 48వ డివిజన్ లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తోట



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** స్థానిక 48వ డివిజన్ ప్రాంతంలో పలు ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో ప్రత్యేక ఆహ్వానం మేరకు తోట రామారావు పలు పూజా కార్యక్రమాలలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి ఆ గణనాధులకు పూలమాలవేసి దైవదర్శనం పొందారు. తదనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు నిర్వహించే వినాయక చవితి పండుగని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఈ ప్రాంత భక్తుల దైవదర్శనం నిమిత్తం వినాయక మండపాలను ఏర్పాటు చేసుకొని ఆ స్వామివారి ఆశీస్సులు పొందుతున్న ఉత్సవ కమిటీలను అభినందిస్తూ రానున్న రోజుల్లో ఇదేవిధంగా భక్తి పర్వంతో ఈ మండపాలను ఏర్పాటు చేసి ఆ స్వామివారి ఆశీస్సులతో జ్ఞానం, విజ్ఞానం, సంపద పొందాలని కొనియాడారు. మండపాన్ని సందర్శించిన తోట రామారావు ని పలు ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సోషల్ మీడియా లో లైవ్ మర్డర్ వీడియో హల్ చల్

- హైదరాబాద్‌లో ఇదీ లా అండ్ ఆర్డర్ దుస్థితి
- హత్యతో నగరంలో భయాందోళనలు
- ఇద్దరు రౌడీషీటర్ల మధ్య నెలకొన్న వివాదం కారణంగానే హత్య
- ప్రాణ స్నేహితుడినే దారుణంగా హత్య
- నాగోల్ బండ్లగూడలో పాత కక్షల నేపథ్యంలోనే మహమ్మద్ నహీమ్‌ను దారుణంగా హత్య చేసిన మహేష్



**హైదరాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** హైదరాబాద్ – నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ ఆనంద్ నగర్ చౌరస్తా సమీపంలో ఖమ్మం ఇల్లెందుకి చెందిన రౌడీషీటర్ మహమ్మద్ నహీమ్ దారుణ హత్యకు గురైయ్యాడు. ఇల్లందు పట్టణానికి చెందిన రౌడీషీటర్లు ఉమామహేశ్వర్ అలియాస్ జేకే మహేష్, మహమ్మద్ నహీమ్ చిన్ననాటి నుండి కలిసి చదువుకున్న ఆప్తమిత్రులు.బండ్లగూడ సహభావన అపార్ట్‌మెంట్లో నివాసముంటున్న మహమ్మద్ నహీమ్.సెటిల్మెంట్లు చేసిన డబ్బుల విషయంలో గత మూడు నెలలుగా వీరిద్దరి మధ్య ముఠా కక్షలే హత్యకు కారణం అని తెలుస్తుంది. ఇద్దరిపైనా ఇప్పటికే పలు హత్య కేసులు, ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. నిందితులు మహేష్ అండ్ టీం కోసం ప్రత్యేక బృందంతో గాలిస్తున్న నాగోల్ పోలీసులు.

# సుడా చైర్మన్‌తో కలిసి సుడా పార్కును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ఖమ్మం, సెప్టెంబర్ 13, నేటి శుభోదయ :** రఘునాధపాలెం మండలంలో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుడా పార్కును సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్‌తో కలిసి సుడా వైస్ చైర్మన్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పార్కులోని మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, సందర్శకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పార్కులో ప్రస్తుతం ఉన్న సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ కమర్తపు మురళి, శేఖర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు గౌస్, సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, సంబంధిత నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మామిళ్లగూడెం మట్టి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని మామిళ్ళగూడెం మట్టి గణపతి ఉత్సవం కమిటీ ఆధ్వర్యంలో 45 వ డివిజన్‌లోని రోడ్ నెంబర్ 3 అంగన్వాడి సెంటర్ ఏర్పాటు చేసిన శ్రీ గణేశ్ విగ్రహానికి కుమ్మరికుంట్ల వెంకన్న దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దంపతులు భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు. వినాయకుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. విగ్రహ దాత మంద మోహన్ రావు నళిని దంపతులు మాట్లాడుతూవినాయక చవితి పండుగ ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని చాటిచెప్పే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. శ్రీకాంత్ మధు మాట్లాడుతూప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం అర్చకులు దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుడు కుమ్మరి కుంట్ల శ్రీకాంత్, మోహన్ రావు నళిని , కమిటీ సభ్యులు నాగకృష్ణ, మధు స్థానికులు, కుటుంబ సభ్యులు, పెద్దలు,పిల్లలు భక్తులు పాల్గొన్నారు.

## పచ్చని ప్రకృతి ఒడిలో, వాన చినుకుల సాక్షిగా సాగుతున్న కల్మషం లేని చిన్నారుల స్నేహానికి...ఐక్యత ను చూపే దృశ్యానికి అక్షర రూపం ఈ కవిత





**నేటి శుభోదయ :** ప్రకృతి ఒడిలో పచ్చని స్నేహం.. వాన చినుకుల కోలాహలం !ఆకాశం అల్లిన నీలి రంగు మేఘాల చాటున, నేలమ్మ మురిసిపోయే పచ్చని చెట్ల నీడన, చిరు జల్లుల సంగీతం మొదలవుతుంటే, బాల్యపు స్నేహం సరికొత్త రాగం తీస్తోంది!కొబ్బరి ఆకులపై పడుతున్న వాన బిందువులు, మట్టి వాసనను మోసుకొచ్చే చల్లని గాలులు, ప్రకృతి పరవశించి చూస్తున్న వేళ, ఈ చిన్నారుల అడుగులు ఆనంద తాండవం చేస్తున్నాయి!చేతులు కలిపి, మనసులు ముడిపి, కష్టాన్ని సైతం ఇష్టంగా మార్చుకుంటూ, తడిసిన దారిలో ఒకరికొకరు తోడై, నిష్కల్మషమైన స్నేహానికి రూపంలా నడుస్తున్నారు!వాన దేవుడు కురిపించే ప్రతి చినుకు, ఈ పిల్లల నవ్వుల్లో ముత్య మై మెరుస్తోంది, ప్రకృతి ఇచ్చిన ఈ పచ్చని వేదికపై, కల్మషం లేని బాల్యం పండగలా విరుస్తోంది ! ( గిరి ప్రసాద్ సోముల, జర్నలిస్ట్ ).

# ఉద్యోగ పదవీ విరమణ పొందిన టిజిఓఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్ కి ఘన సన్మానం







**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**
తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొండపల్లి శేషు ప్రసాద్ పదవి విరమణ పొందిన సందర్భంగా ఆత్మీయ సమనాన కార్యక్రమం టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వర అధ్యక్షతన టీఎన్జీవో ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిజిఓస్ రాష్ట్ర అధ్యక్షులు, టిజిఈజేఏసి రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొండపల్లి శేషు ప్రసాద్ టిజిఓస్ అసోసియేషన్‌లో ఎంతో క్రియాశీలకంగా పనిచేసి, సంఘం పట్ల నిబద్ధతతో సేవలందించారని కొనియాడారు. ఆయన పదవీ విరమణ పొందడం యూనియన్‌కు కొంత లోటేనని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా వీలైనంతవరకు సంఘ కార్యకలాపాల్లో పాల్గొంటూ, తన అనుభవాలను ఉద్యోగుల సంక్షేమానికి ఉపయోగించాలని ఆకాంక్షించారు. అలాగే, పదవీ విరమణ అనంతర జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ టీజీవో ఖమ్మం జిల్లా కార్యవర్గంలో వివిధ హోదాలలో పనిచేసే జిల్లా కోశాధికారిగా అనేక సంవత్సరాలు సేవలందించి టీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, తెలంగాణ ఉద్యోగ మరియు పెన్షనర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి అధ్యక్షులుగా విలువైన సేవలు అందించారని అసోసియేషన్ కి ఎప్పుడు అందుబాటులో ఉంటూ అనేక కార్యక్రమాలు విజయవంతం కావడంలో ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు, టిఎన్జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ సంఘంలో వివాదాలకు తావివ్వకుండా అందరితో కలిసి మెలిసి ఉంటూ తన సహాయ సహకారాలు అందించే వారిని సొసైటీ అధ్యక్షులుగా వారి సేవలను గుర్తు చేశారు. టిజిఓస్ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శేషు ప్రసాద్ రిటైర్ అవ్వడం సంఘానికి లోటు అని వారి విలువైన సూచనలు తమకు ఇవ్వాలని వారికి మంచి ఆరోగ్యం ఐశ్వర్యాన్ని కలిగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీగా, హిస్టరీ లెక్చరర్ గా ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యపల్లిలో పనిచేస్తున్న తమ్మిశెట్టి శ్రీనివాస్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకునిగా అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఏలూరు శ్రీనివాసరావు, టీజీవో జిల్లా కార్యవర్గం ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శేషు ప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించి మెమెంటో తో సత్కరించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న హెడ్మాస్టర్లకు సన్మానించడం జరిగింది, ఈ కార్యక్రమంలో టిఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టిఎన్జీఓస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జెడ్.ఎస్. జయపాల్, ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి బాబు, టిజిఓస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, తమ్మిశెట్టి శ్రీనివాస్, విజయ్ కుమారి, రమేష్, మోదుగు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సంఘ జిల్లా అధ్యక్షులు సింహాచలం, వెటర్నరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ , టిఎస్ జిఆర్ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలమద్ది వెంకటేశ్వర్లు (వైవి), టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే రంజాన్, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్-475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, కృష్ణార్జున రావు, జిఎల్ఏటి రాష్ట్ర అధ్యక్షులు లింగా నాయక్, ఎంపీడీవో శ్రీదేవి, లలిత, డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం బూరుగు శ్రీనివాస్, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, వెటర్నరీ జిల్లా అధ్యక్షులు హరీష్ , జిజేఎల్ఏ -475 జిల్లా అధ్యక్షులు గుమ్మడి మల్లయ్య, వినోద్, టిజిఓ జిల్లా మహిళ కార్యదర్శి సుధారాణి, సతీష్ రెడ్డి , టిగ్గ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నయీమ్ పాష, నరేందర్, డిపి గణేష్, లైబ్రెన్స్ అసోసియేషన్ ఏ మోహన్, టిఎన్జీఓస్ జిల్లా కోశాధికారి వల్లపు వెంకన్న , నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బిక్కు, కాంపటి వెంకటరమణ, స్గమిత్ జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, పొట్టపింజర రాజారావు , వేల్పుల శ్రీనివాస్, మైనార్టీ వెల్ఫేర్ ఎస్.కె. అస్లాం ,తెలంగాణ డ్రైవర్స్ అసోసియేషన్, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు మున్సిపాలిటీ అసోసియేషన్ కన్వీనర్ బుర్రి వెంకటేశ్వర్లు, గఫూర్, ఏఎస్ డబ్లూఓ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులకు వేలల్లో జీతం, లక్షల్లో భత్యం

- **ప్రభుత్వ ఖజానా నుంచే సీఎం, మంత్రుల ట్యాక్స్**
- **ఆర్టీఐ ద్వారా అసలు గుట్టు విప్పిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్**
- **ఇదే మన ప్రజాప్రతినిధుల పన్ను మినహాయింపు మంత్రం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :**
సామాన్య ఉద్యోగి నెల తిరిగేసరికి జీతంలో పన్ను మినహాయింపు (టీడీఎస్) పోగా మిగిలిన చిల్లర కోసం కళ్లప్పగించి చూస్తుంటాడు. పన్ను కట్టకపోతే ఐటీ శాఖ నోటీసులతో ముచ్చెమటలు పట్టిస్తుంది. కానీ మన ప్రజాప్రతినిధుల దగ్గరకు వచ్చేసరికి ఆదాయపు పన్ను శాఖ దయ అపారం. నెలకు రూ. 2.50 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ముడుతున్నా, మన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చెల్లించే ఇన్ కం ట్యాక్స్ మాత్రం సున్నా. సమాచార హక్కు చట్టం ద్వారా లెజిస్లేచర్ జాయింట్ సెక్రెటరీ ఇచ్చిన 13 పేజీల సమాచారంతో ఈ లీగల్ ట్యాక్స్ ఎగవేత లీలలు బట్టబయలు అయ్యాయని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్ జీ జీ) అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి వెల్లడించారు.

**బేసిక్ పే చూస్తే కన్నీళ్లు, భత్యాలు చూస్తే కళ్లు బైరు**

నెలకు రూ. 2.5 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు పారితోషికం అందుకునే ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల బేసిక్ పే కేవలం రూ. 20 వేలేనట. ఇక శాసనమండలి ఛైర్మన్ నెలకు రూ. 4,11,000/- తీసుకుంటుండగా, అందులో బేసిక్ వేతనం రూ. 41 వేలు మాత్రమే. మిగిలిన డబ్బంతా పన్ను మినహాయింపు భత్యాలుగా ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వ ఖజానాకు నయాపైసా ట్యాక్స్ కట్టకుండా దర్జాగా తప్పించుకుంటున్నారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఎద్దేవా చేసింది.

**విప్ ల దర్జా, పన్నుల ఖర్జా**

రాజ్యాంగంలో విప్ అనే పదవే లేకున్నా, అధికార పార్టీ ఏకంగా ఆరుగురు విప్ లను నియమించుకుంది. వీరికి నెలకు రూ. 4 లక్షల వరకు పారితోషికం ముడుతున్నా, రికార్డుల్లో వేతనం మాత్రం రూ. 20 వేలే. అదీ చాలదన్నట్టు ఇటీవల జీవో నం.1064 ద్వారా ముగ్గురు విప్ లకు మంత్రుల హోదా కూడా కట్టబెట్టారు. పదవులు రాజ్యాంగేతరమైనా, ప్రజాధనం దోచిపెట్టడంలో మాత్రం రాజీ పడట్లేదని ఎఫ్ జీ జీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

**మంత్రుల ట్యాక్స్ కూడా జనాల నెత్తినే**

'పేమెంట్ ఆఫ్ శాలరీస్ యాక్ట్-1953' లోని సెక్షన్ 3(4) ప్రకారం.. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల జీతభత్యాలపై చెల్లించాల్సిన ఆదాయపు పన్నును రాష్ట్ర ప్రభుత్వమే (అంటే ప్రజల సొమ్మే) భరిస్తుండటం విడ్డూరం. 'చట్టం ముందు అందరూ సమానులే' అన్న ఆర్టికల్ 14ను ఇది తుంగలో తొక్కుతోందని పద్మనాభరెడ్డి మండిపడ్డారు. దేశంలోని ఎన్నో రాష్ట్రాలు ఈ దోపిడీ నిబంధనను రద్దు చేసినా తెలంగాణలో మాత్రం ప్రజల సొమ్ముతో పాలకుల పన్నులు కట్టే వింత ఆచారం ఇంకా కొనసాగుతోందని విమర్శించారు.

**ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాండ్లు**

ప్రజాధనంతో సీఎం, మంత్రుల ఇన్ కం ట్యాక్స్ కట్టే 'పేమెంట్ ఆఫ్ శాలరీస్ యాక్ట్-1953' సెక్షన్ 3(4)ను తక్షణమే రద్దు చేయాలి. పన్ను ఎగవేత కోసమే బేసిక్ పే తక్కువగా చూపి, అలవెన్సులు ఎక్కువగా ఇచ్చే పద్ధతిని వెంటనే క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే ప్రజా ప్రతినిధులకు కూడా శ్రేణుల వారీగా బేసిక్ పే విధానాన్ని ప్రవేశపెట్టి దానికి అనుగుణంగానే డిఎ, హెచ్ ఆర్ఏ , ఎఫ్ టిఏ వంటి అలవెన్సులు మాత్రమే వర్తింప చేసి మిగతా అలవెన్సులు అన్నింటినీ రద్దు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల వలే వాళ్ల, వాళ్ల జీత భత్యాల నుండే పన్ను వసూలు చేయాలి. లేదంటే ఉద్యోగస్తులకు కూడా ప్రభుత్వమే పన్ను కట్టాలి.

**విప్ లకు కల్పించిన మంత్రుల హోదాను వెనక్కి తీసుకోవాలి**

ప్రజా ప్రతినిధులు కేవలం సేవకులు మాత్రమే కానీ ప్రభుత్వ ఉద్యోగులు కాదు కాబట్టి వారికి ఇచ్చే గౌరవ వేతనం కూడా చిట్ట చివరి శ్రేణి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే స్కేల్ మరియు అలవెన్స్ లు మాత్రమే వర్తించే విధంగా చట్టం చేసి, ప్రభుత్వం మీద పడే ఆర్థిక భారాన్ని తగ్గించాలి. ప్రతి పార్టీకి ఒక్క విప్ ను మాత్రమే నియమించే నిబంధన తేవాలి.

# త్రివేణిలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

- **సాంకేతిక ఆలోచనలు, సృజనాత్మకతతో దేశాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు పిలుపు**



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని "ఆలోచనలకు రూపమిచ్చి.. అభివృద్ధికి దిశానిర్దేశం చేసేవారే ఇంజనీర్లు" అనే సందేశంతో ఇంజనీర్స్ డే వేడుకలను త్రివేణి పాఠశాల, ఖమ్మం శాఖలో ఘనంగా నిర్వహించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఇంజనీరింగ్ రంగానికి, దేశ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే దిశగా విద్యార్థులు ఆలోచించాలని సూచించారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య జీవితం, సేవలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంజనీరింగ్ రంగం ప్రాముఖ్యత, వివిధ విభాగాలు, దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్రపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యభిచార ముఠా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్ ప్రయోగం : పోలీస్ కమిషనర్



**ఖమ్మం, సెప్టెంబర్ 15 నేటి శుభోదయ :** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలను వ్యభిచారంలోకి దింపి ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం,చిరుమర్రి గ్రామానికి చెందిన నిందితుడు బత్తుల బాలకృష్ణ, 30సం, ఆర్థిక లాభాల కోసం జిల్లాలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తూ,మహిళలను వ్యభిచారంలోకి తీసుకువచ్చే అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు బాలకృష్ణపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో, అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి.2026 జనవరి 6న విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం గాంధీచౌక్‌లోని ఓ లాడ్జిలోని గది ని పోలీసులు దాడి చేశారు. వ్యభిచార కార్యకలాపాల కోసం లాడ్జిలో గది పొందేందుకు అధిక మొత్తంలో డబ్బు చెల్లించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బాలకృష్ణ, మెరెడ్డి సత్యవతి, లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ తో కలిసి కుట్రపూరితంగా వ్యవహరించినట్లు తెలిపారు. కాకినాడ కు చెందిన మహిళను ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొనివ్యభిచారంలోకి తీసుకువచ్చినట్లు,ఖమ్మంకు తరలించి లాడ్జి గదిలో ఉంచి, కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది.నిందితుడి నేర ప్రవర్తనను నిరోధించేందుకు శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం, 1986 (పీడీ యాక్ట్) సెక్షన్ 3(2) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలు కు తరలించారు.

# ఒక్క ఓటు కూడ మిస్ కావద్దు



**ఖమ్మం, సెప్టెంబర్ 15 నేటి శుభోదయ :** ఒక్క ఓటు కూడ మిస్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్ హియరింగ్ పై ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. మండలం లోని వివిధ గ్రామాలలో వివిధ అంశాలలో తప్పులను సరిదిద్దేందుకు మొత్తం 2014 మంది మందికి నోటీసులు జారీ చేశారు. వారి కోసం ప్రత్యేక అధికారులు హియరింగ్ నిర్వహించారు. వారిలో 1.071 మంది డాక్యూమెంట్ ను అందించారు. ఇంకా 954 మంది డాక్యూమెంట్స్ ఇవ్వాల్సి ఉంది. కావునా వీరికి మరో మారు సమాచారం ను అందించి వెంటనే అవసరమైన డాక్యూమెంట్స్ ఇవ్వాలని నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏ ఒక్కరి ఓటు కూడ తొలిగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.డాక్యూమెంట్స్ ఇవ్వని ఓటర్లు వెంటనే పత్రాలు అందించి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి యం. శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, సుందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా ఆదివాసీ(ఎస్ టి ) అధ్యక్ష పదవికి దరఖాస్తుల ఆహ్వానం

### - నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదివాసి(ఎస్ టి) డిపార్ట్‌మెంట్ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా ఆదివాసీ(ఎస్ టి) డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్ష పదవి కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఔత్సాహిక అభ్యర్థుల నుండి నేడు ది 16-09-2026 న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 04.00 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదివాసి ఉపాధ్యక్షులు కూరాకుల మల్లిఖార్జున జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ల సమక్షంలో జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భావజాలం కలిగి ఉండి, పార్టీ కొరకు నిబద్ధతతో పనిచేయాలనుకునే ఔత్సాహిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## హరివిల్లు లో ఘనంగా గణపతి నవరాత్రులు



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఖమ్మంలోని కవరాజు నగర్ లో హరివిల్లు అపార్ట్మెంట్లో 2వ రోజు మంగళవారంఉదయం 7:00 గంటలకు:శ్రీ నల్లమోతు రాజారావు – రమ ల దంపతులు, వారిద్దరి కుమార్తెలు కొమర నేని కిషోర్ –పద్మజ, కోడె సతీష్ – నీరజ ల దంపతులచే వినాయక పూజ, "108"హనుమాన్ చాలీసా కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులందరూ పాల్గొన్నారు. మధ్యాహ్నం : హరివిల్లు నివాస్తులైన వారిచ్చే అన్నదాన కార్యక్రమం'తుమ్మల నరసింహారావు – కనకమ్మ ల దంపతులచే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొన్నారు. రాత్రి పూజ అనంతరం కమిటి వారిచే అల్పాహారం ఏర్పాటు చేశారు.

## అస్సాం తుఫాన్ బాధితులకు జమియతే ఉలేమాయే హింద్ చేయూత



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** భారతదేశ వ్యాప్తంగా ఏదైనా ప్రకృతి విపత్తు సంభవిస్తే మేమున్నా మంటూ భరోసా నిస్తూబాధితులను ఆదుకునేందుకు ముందుంటుంది జమియాతే ఉలేమాయే హింద్ సంస్థ. అస్సాం తుఫాన్ బాధితులకు జమియతే ఉలేమాయే హింద్ ఆర్థిక చేయూతను అందించి తన ఉదారతను చాటుకుంది. జాతీయ అధ్యక్షులు మౌలానా మహమూద్ మదని ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో పలు మస్జిద్లలో విరాళాల సేకరణలో భాగంగా శుక్రవారం ఒక లక్ష 52 వేల 200 రూపాయలను జే యు హెచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ఎహెసనుద్దీన్ కు ఖమ్మం జిల్లా బాధ్యులు హాఫిజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్ అందజేశారు. ఈనగదును రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ఎహేసనుద్దిన్ ద్వారా జాతీయ అధ్యక్షులకు ఈ రిలీఫ్ ఫండ్ ను అందజేయనున్నారు. ఈ సందర్భంగా జె యు హెచ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మౌలానా ముఫ్తీ సయీద్ అహ్మద్ ఖాశ్మీ ఖమ్మం జిల్లాలో గల అన్ని మస్జిదుల సదర్ ప్రెసిడెంట్ లకు విరాళాలు అందజేసిన మానవీయ హృదయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## 10 శాతం ఎస్టీ రిజర్వేషన్‌కు గుర్తుగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన నాయకుడు కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- డా. బానోత్ చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే, వైరా





**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** తెలంగాణలో గిరిజనులకు 6 శాతం నుంచి 10 శాతానికి ఎస్టీ రిజర్వేషన్ పెంచి అమలు చేసిన చారిత్రాత్మక నిర్ణయాన్ని స్మరించుకుంటూ, ఖమ్మంలో బీఆర్ఎస్ గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి మాట్లాడుతూ గిరిజనుల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వయం పాలన, రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం కల్పించిన ఘనత కేసీఆర్ గారిదేనని పేర్కొన్నారు.“10 శాతం రిజర్వేషన్ అనేది కేవలం శాతం పెంపు కాదు. గిరిజన యువత విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తుకు ఇచ్చిన హక్కు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం గిరిజనుల స్వయం పాలనకు వేసిన బలమైన పునాది” అని అన్నారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గిరిజన విద్యకు ప్రాధాన్యత, గురుకులాల విస్తరణ, తండాలు, గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పోడు భూముల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను గుర్తు చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని నాయకులు విమర్శించారు. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యలో రిజర్వేషన్ ప్రయోజనాల సమర్థ అమలు, పోడు భూముల సమస్యలు, తండాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వసంత, సర్పంచ్, భగత్‌వీడు తాండా, బదావత్ అనుషా, గాయిగొళ్లపల్లి, బుగ్లోత్ మాధవి, మంగల్ తాండా, బాణోత్ దిక్షం నాయక్, గుర్వావత్ తాండా, జర్పులా బాలాజీ, బోడా మంచా నాయక్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, అమర్ సింగ్, మాజీ జెడ్పీటీసీ, బోడా వీర కుమార్, మాజీ సర్పంచ్, బుక్యా సాయి, స్టూడెంట్ ఆర్గనైజేషన్, తదితరులు పాల్గొన్నారు.ధరావత్ శంకర్, బాణోత్ కొండా, బానోత్ కృష్ణ,బాణోత్ కిషన్, లకావత్ గిరిబాబు, మంచా నాయక్, బుక్యా కృష్ణా, బాణోత్ కిషన్ నాయక్, బాణోత్ బాలాజీ నాయక్, బాణోత్ భీక్షం, బాణోత్ రెడ్డియా నాయక్, మాళోత్ నాగేశ్వర్ రావు, శంకర్ నాయక్, జర్పులా వీరన్న, తేజవత్ రామ్మూర్తి తదితరులు మాట్లాడారు. వారు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గిరిజన ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సెప్టెంబర్ 17న నిర్వహించనున్న కార్యక్రమాల్లో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని, 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ఉన్న చారిత్రాత్మక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని కోరారు. “ఒక ప్రభుత్వాన్ని గిరిజనులు మాటలతో గుర్తుంచుకోరు. తమకు వచ్చిన హక్కులు, అవకాశాలు, ఆత్మగౌరవంతో గుర్తుంచుకుంటారు. ఆ విషయంలో కేసీఆర్ నిర్ణయాలు తెలంగాణ గిరిజన చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి” అని పేర్కొన్నారు. గిరిజనులకు ఇప్పటికే సాధించిన హక్కులను కాపాడటంతో పాటు, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యల కోసం బీఆర్ఎస్ గిరిజన నాయకత్వం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.“గిరిజనులకు సాధించిన హక్కులను కాపాడటం, ఇంకా రావాల్సిన హక్కులను సాధించడం మా బాధ్యత. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం విషయంలో రాజీ ఉండదు” అని స్పష్టం చేశారు.

## కేజిబివి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** కేజిబివి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పిఆర్టియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పిఆర్టియు సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యల సేకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూసుమంచి కేజిబివి ని సందర్శించిన జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు, ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజిబివి ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ వారి ఉద్యోగ పరిస్థితుల్లో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ కాంట్రిబ్యూషన్‌తో ఆరోగ్య కార్డులు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కేజిబివి లలో విద్యార్థుల సంరక్షణ, పాఠశాల నిర్వహణకు అనుగుణంగా ప్రత్యేకంగా కేర్‌టేకర్ పోస్టులు, వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని, సిబ్బందిపై అదనపు పనిభారం తగ్గించాలని కోరారు. కేజిబివి ఉద్యోగులకు సర్వీస్‌కు సంబంధించిన స్పష్టమైన నిబంధనలు, బదిలీలు, సెలవులు, వేతనాలు, ఇతర ఉద్యోగ ప్రయోజనాల్లో సముచిత న్యాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.కేజిబివి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పిఆర్టియు నిరంతరం పోరాటం చేస్తోందని, ఇప్పటివరకు సాధించిన అనేక సమస్యల పరిష్కారాలు పిఆర్టియు ద్వారా, మన శాసనమండలి సభ్యులు శ్రీ పాల్ రెడ్డి కృషితో సాధించామని కట్టా శేఖర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా కేజిబివి ఉద్యోగుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు టి. రత్న కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు టి. చంద్రశేఖర్, కూసుమంచి మండల అధ్యక్షులు ఎస్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి 5 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడు మరుపల్లి రాంబాబు కు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.41,500 జరిమానా విధిస్తూ మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు, ఖమ్మం న్యాయమూర్తి శివ రంజని తీర్పు చెప్పారు. ఖమ్మం వన్ టౌన్ లో క్రైమ్ నంబర్ 19/2024, సెక్షన్లు 307, 294(బి) , 324, 506 ఐపిసి కింద ఖమ్మం చెరువు బజార్ చెందిన మరుపల్లి రాంబాబు 35 సం, పై నమోదు అయిన కేసులో దర్యాప్తు అనంతరం పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది.కేసు దర్యాప్తు అధికారులు ఎస్సై కే వెంకటేష్, ఏస్సై యయాతిరాజ్, ఆధ్వర్యంలో దర్యాప్తు పూర్తిచేశారు. కేసు విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాపని స్వప్న న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా సహకరించిన బ్రీఫింగ్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, పోలీసు అధికారులు, కోర్టు లైజన్ సిబ్బంది, ప్రాసిక్యూషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## మంగాపురం మేజర్ కాలువ ను పరిశీలించిన సీఈ వాసంతి

- **16,17 బ్రాంచికి 800 క్యూసెకులు, మంగాపురం మేజర్ కు 450 సరఫరా కు ఆదేశాలు**



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురం మేజర్ కాలువ ను నీటిపారుదల శాఖ సీఈ వాసంతి పరిశీలించారు. నేల కొండపల్లి ' మండలం–లోని మంగాపురం మేజర్ కు నీరు రావటం లేదని, గ్రామానికి చెందిన ధీరావత్ రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో రైతులు మంగళవారం సీఈ కి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఈ వెంటనే మంగాపురం–19 మేజర్ ను పరిశీలనకు వచ్చారు. కాలువ నీటి సరఫరా ను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మంగాపురం మేజర్ కు 450, నందిగామ బ్రాంచి 16, 17 .కెనాల్ కు 800 క్యూసెకుల నీటిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలూరు ఎస్.ఈ. శ్రీకాంత్, నేలకొండపల్లి డీఈఈ పొట్టయ్య, ఏఈ లు మనోజ్ఞ, నరేష్, రుత్విన్రెడ్డి, మధీనా, పద్మరాజు, దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

## మాల వేసుకుంటే క్లాసులోకి రానివ్వరా..?

- **హార్వెస్ట్ కళాశాల యాజమాన్యం తీరుపై తీవ్ర ఆగ్రహం**
- **వినాయక మాల ధరించిన ఆరుగురు విద్యార్థులకు తరగతుల్లోకి నో ఎంట్రీ**
- **విద్యార్థుల విశ్వాసాలపై ఆంక్షలా**
- **తల్లిదండ్రులు, హిందూ సంఘాల మండిపాటు**

**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** విద్యార్థులు వినాయక మాల ధరించడమే నేరమా.. మాల వేసుకున్నారని తరగతి గది తలుపులు మూసేయడమేంటి? ఖమ్మం నగరం లోని మమతా రోడ్డులో ఉన్న హార్వెస్ట్ జూనియర్ కళాశాలలో చోటు చేసుకున్న ఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వినాయక చవితి సందర్భంగా వినాయక మాల ధరించి కళాశాలకు వచ్చిన ఆరుగురు విద్యార్థులను తరగతుల్లోకి అనుమతించలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి.విద్యార్థులు మాలను తొలగించిన తర్వాతే తరగతులకు అనుమతిస్తామని యాజమాన్యం చెప్పినట్లు విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో విషయం కాస్తా తల్లిదండ్రుల ఆగ్రహానికి, ఆ తర్వాత హిందూ సంఘాల ఆందోళనకు దారితీసింది.చదువుకునే విద్యార్థులపై క్రమశిక్షణ పేరుతో నిబంధనలు విధించడం ఒక ఎత్తయితే.. వారి మత విశ్వాసాలకు సంబంధించిన అంశాల్లో యాజమాన్యం జోక్యం చేసుకోవడంపై తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. విద్యార్థులు మాల ధరించడం వల్ల విద్యాభ్యాసానికి కలిగే ఇబ్బంది ఏమిటని వారు ప్రశ్నించారువిషయం బయటకు రావడంతో విద్యార్థుల కుటుంబ సభ్యులతో పాటు బీజేపీ, ఏబీవీపీ, హిందూ సంఘాల ప్రతినిధులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. విద్యార్థులను వెంటనే తరగతులకు అనుమతించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు.ఆందోళన ఉధృతం కావడంతో చివరకు విద్యార్థులను తరగతుల్లోకి అనుమతించినట్లు సమాచారం. దీంతో ముందు నిబంధనల పేరుతో అడ్డుకోవడం ఆందోళన మొదలైన తర్వాత అనుమతించడం వెనుక అసలు కారణమేంటి అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కళాశాల యాజమాన్యం సమాధానం చెప్పాల్సిందే అంటూ పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థులపై తీసుకున్న చర్యకు కారణమేంటి మాల ధరించడం కళాశాల నిబంధనలకు విరుద్ధమైతే ఆ నిబంధనలను ముందుగానే విద్యార్థులకు ఎందుకు స్పష్టం చేయలేదనీ ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఒకే ఘటనపై ఆందోళన తర్వాత నిర్ణయం ఎందుకు మారింది చెప్పాలని యాజమాన్యం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థులకు విద్య అందించాల్సిన విద్యాసంస్థల్లో వివాదాలకు తావులేకుండా, అన్ని వర్గాల విశ్వాసాలను గౌరవిస్తూ వ్యవహరించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై హార్వెస్ట్ కళాశాల యాజమాన్యం వివరణ ఇవ్వాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- **బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు**
- **కలెక్టర్కు వినతి పత్రం సమర్పించిన నేతలు**



**ఖమ్మం, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబరు 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు అమరవీరుల త్యాగాలను గౌరవించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు కోరారు.

**విమోచన చరిత్రకు శాశ్వత గుర్తింపు**

1948 సెప్టెంబరు 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన రోజని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దురాగతాలు, జమీందారీ–జాగీర్దారీ దోపిడీ నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రక సందర్భానికి ఈ రోజు ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ విమోచన కోసం రైతులు, మహిళలు, యువకులు, సామాన్య ప్రజలు చేసిన పోరాటాన్ని గుర్తించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా అధికారిక కార్యక్రమాలు**

ప్రతి సంవత్సరం సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వినతిపత్రంలో కోరారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించి విమోచన పోరాట చరిత్రను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు

**సర్దార్ పటేల్ విగ్రహం ఏర్పాటు చేయాలి**

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లో 'స్టాట్యూ ఆఫ్ లిబరేషన్–తెలంగాణ' పేరుతో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ విమోచనకు, భారత ఐక్యతకు శాశ్వత ప్రతీకగా ఈ విగ్రహం నిలిచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**విమోచన చరిత్రపై మ్యూజియం ఏర్పాటు**

హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో 'హైదరాబాద్–తెలంగాణ విమోచన మ్యూజియం' ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు కోరారు. నిజాం పాలన, రజాకార్ల దురాగతాలు, ప్రజా పోరాటాలు, ఆపరేషన్ పోలో, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక పరిణామాలకు సంబంధించిన ఆధారాలను మ్యూజియంలో భద్రపరచాలని సూచించారు.

**జిల్లాల్లో స్మృతి కేంద్రాలు**

ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్మృతి కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో జరిగిన పోరాటాలు, స్థానిక వీరులు, అమరవీరుల చరిత్రను నమోదు చేయాలని కోరారు. తద్వారా స్థానిక చరిత్రను భావితరాలకు అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు.

**పాఠ్యపుస్తకాల్లో చరిత్రకు చోటు**

తెలంగాణ విమోచన పోరాట చరిత్రను పాఠశాలలు, కళాశాలల పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దురాగతాలు, జమీందారీ–జాగీర్దారీ దోపిడీ, ప్రజా పోరాటం, ఆపరేషన్ పోలో వంటి అంశాలను విద్యార్థులకు చరిత్రలో భాగంగా బోధించాలనీ కోరారు. అలాగే విమోచన పోరాటంలో పాల్గొన్న తెలిసిన, తెలియని వీరులు, అమరవీరుల అధికారిక జాబితాను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

**చారిత్రక గ్రామాల్లో స్మారక చిహ్నాలు**

రజాకార్ల దురాగతాలకు గురైన, ప్రజా ప్రతిఘటనలు జరిగిన బైరాన్‌పల్లి, పరకాల వంటి చారిత్రక ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అలాంటి గ్రామాలను గుర్తించి అక్కడ తెలంగాణ విమోచన స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయాలని కోరారు.

**చారిత్రక ప్రాంతాలతో పర్యాటక మార్గం**

తెలంగాణ విమోచన పోరాటానికి సంబంధించిన చారిత్రక గ్రామాలు, కోటలు, పోరాట కేంద్రాలు, అమరవీరుల స్థలాలను అనుసంధానిస్తూ 'తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్'ను అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు సూచించారు. చరిత్రను పరిరక్షించడంతో పాటు పర్యాటకాభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

**జిల్లా పరిధిలో చర్యలు చేపట్టాలి**

తెలంగాణ సప్తసంకల్పాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జిల్లా పరిధిలో అమలు చేయగల అంశాలపై తగిన చర్యలు చేపట్టాలని నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలోని బీజేపీ ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. సెప్టెంబరు 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మందడపు సుబ్బారావు, వీరవల్లి రాజేష్, అల్లిక అంజయ్య, మంద సరస్వతి, శ్రీరామనేని మని తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామం నారాయణపురంలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు

- **రైతులతో ఆత్మీయంగా ముచ్చటించిన బీజేపీ సీనియర్ నాయకుడు**



**ఖమ్మం / కల్లూరు, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి మంగళవారం తన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. అనంతరం హనుమాన్ సమేత శ్రీ సీతారామాలయాన్ని సందర్శించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వినాయక మండపాల సందర్శన: నారాయణపురం యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి సందర్శించి గణనాథుడికి పూజలు నిర్వహించారు. భక్తి, క్రమశిక్షణ, సామూహిక స్ఫూర్తితో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్న గ్రామ యువతను ఆయన అభినందించారు. రైతులతో ఆత్మీయ సంభాషణ: అనంతరం నారాయణపురం గ్రామంతో పాటు కల్లూరు మండలానికి చెందిన పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారులతో ఆయన ఆత్మీయంగా ముచ్చటించారు. పీఎం–కిసాన్ ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నేరుగా సాయం: రైతులకు నేరుగా, పారదర్శకంగా ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తోందని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాలు, వారి అనుభవాలను తెలుసుకోవడంతో పాటు గ్రామీణ కుటుంబాలకు ఉపయోగపడుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై వారితో వివరంగా చర్చించారు. స్వగ్రామ ప్రజలతో గడపడం ఆనందంగా ఉంది: తన స్వగ్రామ ప్రజలు, రైతులు, యువతతో కలిసి సమయం గడపడం ఎంతో ఆనందంగా ఉందని పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువత భాగస్వామ్యం వంటి అంశాలపై స్థానికులతో మమేకమై కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాయకులు, రైతుల పాల్గొనడం: కార్యక్రమాల్లో జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకటేశ్వరరావు, కల్లూరు మండల అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ, మండల కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు చి. వెంకటేశ్వరరావు, మండల కిసాన్ మోర్చా కార్యదర్శి బొడ్డు నాగరాజు తదితర నాయకులతో పాటు రైతులు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అనుమతులు ఓచోట తవ్వకాలు మరోచోట

- **మధిర మండలంలో యథేచ్ఛగా అక్రమ మట్టి మాఫియా**
- **కోర్టు వివాదంలో ఉన్న భూముల్లోనూ ఆగని తవ్వకాలురెండు కొండలు మాయం**
- **మరొకటి కరిగిపోయే ప్రమాదం**
- **వాపోతున్న ఎండపల్లి గట్టు దళిత రైతులు**



**ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 15, నేటి శుభోదయ :** మండల పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. అనుమతులు ఒకచోట తీసుకుని తవ్వకాలు మరోచోట జరుపుతూ అక్రమార్కులు నిబంధనలను యథేచ్ఛగా తుంగలో తొక్కుతున్నారు. సిరిపురం గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఎండపల్లి పరిసర ప్రాంతాల్లో కొండలను సైతం పిండిచేస్తూ మట్టిని తరలిస్తుండటంతో స్థానిక రైతులు, భూ బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.––– కోర్టు పరిధిలో ఉన్నా ఆగని దందాఎండపల్లి ప్రాంతంలోని సర్వే నంబర్లు 61, 62, 63ల పరిధిలో సుమారు 250 ఎకరాల ప్రభుత్వ, అటవీ భూములు విస్తరించి ఉన్నాయి. ఇందులో సుమారు 84 ఎకరాలను ప్రభుత్వం గతంలో పారిశ్రామిక అవసరాల నిమిత్తం కేటాయించింది. అయితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో పేద రైతులకు జీవనోపాధి కోసం ఒక్కొక్కరికి 16 కుంటల చొప్పున ప్రభుత్వం సాగు పట్టాల మంజూరు చేసింది.ఇటీవల భూములు సాగులో లేవనే నెపంతో ప్రభుత్వం ఆ పట్టాలను రద్దు చేసి, సదరు భూమిని ఇతరులకు కేటాయించింది. దీనిపై బాధితులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. భూ వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉండగానే, కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపడుతుండటంపై రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు."కేసు కోర్టులో నడుస్తుండగా తవ్వకాలు ఎలా చేపడతారు?" అని బాధితులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు.కరిగిపోతున్న కొండలు.ఈ ప్రాంతంలో గతంలో మూడు సహజసిద్ధమైన కొండలు ఉండేవి. నిరంతరాయంగా సాగుతున్న మట్టి తోలకాల కారణంగా ఇప్పటికే రెండు కొండలు పూర్తిగా కనుమరుగైపోగా, ప్రస్తుతం మిగిలిన ఒకే ఒక్క కొండ కూడా కరిగిపోయే స్థితికి చేరింది. అనుమతులు లేని ఈ భారీ తవ్వకాల వల్ల ఓవైపు పర్యావరణ విధ్వంసం జరుగుతుండగా, మరోవైపు మైనింగ్ రాయల్టీ చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. బాధితుల ఆవేదనఅనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని వదిలిపెట్టి వివాదాస్పద స్థలాల్లో యథేచ్ఛగా తవ్వుతున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్, అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని, అక్రమ మట్టి రవాణాను తక్షణమే నిలిపివేసి బాధితులకు న్యాయం చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620